S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/26/A3949

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 1 | సంచిక: 65 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |



## పోలీసులకే సవాల్

- సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్
- దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు
- బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య
- ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్

కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ

4

## బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన

4





## ఏపీపీఎస్సీ, డీఎస్సీలను నాశనం చేసింది వైసీపీనే!

విమర్శలు చేయడం సిగ్గుచేటన్న మంత్రి నారా లోకేశ్

- 2029లోపు మరో 3 డీఎస్సీలు
- ఏప్రిల్ నాటికి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీ

2

# ఏఐ వచ్చినా.. టీచర్ల స్థానం ప్రత్యేకం!

2027 నాటికి వంద శాతం అక్షరాస్యతే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి పాఠశాలకు ఓ బ్రాండ్ ఉండాలి

- ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విజయవాడ (సమయం న్యూస్): విద్యార్థులను భవిష్యత్ ప్రపంచానికి సిద్ధం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఆయన ఆకాంక్షించారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఏఐ, క్వాంటం, రోబోటిక్స్ వంటి ఆధునిక రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏఐ లాంటి వ్యవస్థలు వచ్చినా ఉపాధ్యాయుల స్థానాన్ని ఏదీ భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు కోర్సులను రీస్ట్రక్చరింగ్ చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలలను ప్రత్యేక బ్రాండ్‌గా తీర్చిదిద్దాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. చదువుకునే వయసులో ప్రతి విద్యార్థి బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ

మిగతా 2 లో





## గురు పరిరక్షణ

తాడేపల్లిలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీల దీక్ష!

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్
- మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని పట్టు

3

డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఎమ్మెల్సీలు 'గురు పరిరక్షణ దీక్ష' చేపట్టారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్న ఈ దీక్షను పార్టీ పార్లమెంటరీ నేత వైవీ సుబ్బారెడ్డి నల్ల కండువాలు వేసి ప్రారంభించారు.

2

## స్థానిక ఎన్నికలకు ముందడుగు!

3 దశల్లో వార్డుల డీలిమిటేషన్

39 పట్టణాల్లో వార్డుల పునర్విభజన

సెప్టెంబర్ 15 నాటికి ప్రక్రియ పూర్తి

## ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట!

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష



2

## ఉద్యోగులకు గుడ్ న్యూస్!

సీఎం చంద్రబాబు వరాలు

- రెండు పెండింగ్ డీఏల విడుదల
- 12వ పీఆర్సీ కమిషన్ నియామకానికి గ్రీన్ సిగ్నల్

2

## రేపే విజయసాయిరెడ్డి పొలిటికల్ క్లారిటీ



- 7న విజయవాడలో మీడియా సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై వీడనున్న ఉత్కంఠ
- ఏపీ సమస్యలపై చర్చిస్తానని ట్వీట్


వివరాలు 3లో..

## విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖీ
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ

4





## వైజాగ్ జూకు కొత్త అతిథులు!

- జామ్‌నగర్ ట్రస్ట్‌తో విజయవంతమైన జంతు మార్పిడి
- తొలిసారిగా కాటన్-టాప్ టామరిన్ల రాక
- వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

3

## కొత్త ప్రపంచ పటానికి ఐరాస ఆమోదం!

- భూమి ఉపరితలాన్ని కచ్చితంగా చూపించే ఈక్వల్ ఎర్త్ మ్యాప్
- వ్యతిరేకించిన అమెరికా.. పూర్తిగా పక్కనపెట్టిన ఫ్రాన్స్
- ఖండాల వాస్తవ విస్తీర్ణానికి అనుగుణంగా కొత్త మ్యాప్

3





లష్కర్ కమాండర్

## హతం

- భద్రతా దళాల మెరుపు దాడి
- బద్గాంలో సంయుక్త ఆపరేషన్

4

# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట!

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష**

**అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కూటమి సర్కారు ప్రాధాన్యం**

**పథకాల అమలు తీరుపై అధికారులకు దిశానిర్దేశం**

**అమరావతి (సమయం న్యూస్):** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ ఉన్నతస్థాయి కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో ఆయా వర్గాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృతంగా సమీక్షించారు. మంత్రులు డీఎస్‌బీవీ స్వామి, సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల అమలు తీరు, అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో ప్రయోజనాలు అందుతున్నాయా లేదా అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, సామాజిక భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి తదితర రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమాలోచనలు జరిపారు. ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. అట్టడుగు వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వారి అభ్యున్నతికి అవసరమైన కొత్త కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలపైనా భేటీలో చర్చించారు. ఎస్సీ, ఎస్టీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సమావేశం స్పష్టం చేసింది.

# 10, 11 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

**అమరావతి, సెప్టెంబర్ 5:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 10, 11 తేదీల్లో వెలగపూడి సచివాలయంలో 8వ కలెక్టర్ల సదస్సు జరగనుంది. మంత్రులు, ఉన్నతాధికారులు హాజరయ్యే ఈ సమావేశంలో తొలిరోజు ఆర్థిక వృద్ధి, స్వర్ణాంధ్ర–2047, సంక్షేమ పథకాలపై, రెండో రోజు ఈ–గవర్నెన్స్, ఆర్టీజీఎస్, రెవెన్యూ అంశాలపై విస్తృతంగా సమీక్షించనున్నారు.

# మెగా డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత!

**క్రీడా కోటా పోస్టింగ్ ఆరోపణలపై విద్యాశాఖ సీరియస్**

**కర్నూలు డీఈవో ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు**

**రికార్డులు, వెరిఫికేషన్ ఫైళ్ల పరిశీలన**

**విచారణ నివేదిక అందగానే బాధ్యులపై కఠిన చర్యలు**

**అమరావతి (సమయం న్యూస్):** మెగా డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో సంపూర్ణ పారదర్శకత, ప్రతిభ ఆధారిత ఎంపిక విధానాన్ని అవలంబించామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఒక ప్రకటనలో పునరుద్ఘాటించారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలం వల్లూరు ఎంపీపీఎస్ (న్యూ) పాఠశాలలో క్రీడా కోటా కింద ఈడగ ప్రభాకర్ అనే అభ్యర్థి ఎస్జీటీ (తెలుగు) ఎంపిక, పోస్టింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో కథనాలు వస్తున్నాయి. దీనిపై స్పందించిన విద్యాశాఖ తక్షణమే విచారణకు ఆదేశించింది. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే శాఖాపరమైన దర్యాప్తును ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులు సైతం ఈ విచారణ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. కర్నూలు డీఈవో విచారణను ప్రారంభించి, సమగ్ర పరిశీలన కోసం సంబంధిత రికార్డులు, వెరిఫికేషన్ ఫైళ్లను తెప్పించి పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారంపై విచారణ నివేదిక అందగానే రిక్రూట్‌మెంట్, సర్వీస్ నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. నియామకాల్లో ఎక్కడ అక్రమాలు జరిగినా ఉపేక్షించేది లేదని అధికారులు వెల్లడించారు.

# భద్రతా చర్యలు పాటించని యజమానులపై కేసులు

**ఏలూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి**

**ఏలూరు, సెప్టెంబర్, 5:** కర్మాగారాలలో పటిష్టమైన భద్రతా చర్యలు పాటించని యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏలూరు జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి హెచ్చరించారు. ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాలో ప్రమాదకరమైన రసాయనాలు కర్మాగారాలలో ఉత్తమ భద్రత విధానాలపై ఆయా సంస్థలలో పనిచేసే భద్రతా అధికారులతో శనివారం రాజమండ్రిలోని ఆంధ్రపేపెర్ కర్మాగారంలో కృష్ణమూర్తి సమీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాలలోని కర్మాగారాలలో ముఖ్యంగా ప్రమాదకరమైన రసాయనాలు తయారుచేసే కర్మాగారాలలో కార్మికుల భద్రతకు పూర్తిస్థాయిలో భద్రత చర్యలు చేయవలసిందే బాధ్యత ఆయా కర్మాగార యజమానులదేనన్నారు. ఆయా కర్మాగారాలలో భద్రతా చర్యలను భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. తమ శాఖ సిబ్బంది తనిఖీకి వచ్చినప్పుడు భద్రతా లోపాలను గుర్తించినట్లయితే కర్మాగారాలను మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామని, అంతేకాక సంబంధిత కర్మాగార యజమానులు, భద్రతా అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస , ఏలూరు మరియు తూర్పు గోదావరి జిల్లాల నుండి వివిధ కర్మాగారాముల నుండి మొత్తం 50 మంది భద్రతా అధికారులు హాజరయ్యారు.

# ఏఐ వచ్చినా టీచర్ల స్థానం ప్రత్యేకం!

(మొదటిపేజీ తరువాయి..)

లక్ష్యమన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో వంద శాతం అక్షరాస్యత సాధించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఏడో తరగతి చదివే విద్యార్థులు సైతం ఏఐలో ప్రావీణ్యం సాధించేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రతి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కూటమి ప్రభుత్వం రాగానే మెగా డీఎస్సీ ద్వారా నియామకాలపై తొలి సంతకం చేశామని గుర్తుచేశారు.



**సవాళ్లతో కూడిన విద్యాబోధన**

టెక్నాలజీతో ఉపాధ్యాయులకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని సీఎం అన్నారు. సున్నితమైన పరిస్థితుల మధ్య ఉపాధ్యాయులు వివేకంతో ఆలోచించి వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాల ప్రభావంతో చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విద్యార్థులు పాల్పడిన పలు తీవ్రమైన నేర ఘటనలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో విద్యాబోధన సవాళ్లతో కూడిన అంశంగా మారిపోయిందని, దీనికి పరిష్కారంగా ఆధ్యాత్మికత, యోగా, ధ్యానం లాంటివి అలవాటు చేయాలని పిలుపునిచ్చారు.

**ఉద్యోగులకు వరాల జల్లు**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీఎం పలు వరాలు ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం తెలిపామని, రెండు డీఏలను అక్టోబరు నుంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 2022 సరెండర్ లీవ్ మొత్తాన్ని సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని, పోలీసులకు ఈ దసరాకు అదనపు సరెండర్ లీవ్ ఇస్తామని తెలిపారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10–15 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఎంప్లాయీస్ హెల్త్ ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రతినెలా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 175 మందిని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సత్కరించారు. అవార్డు సాధించిన దివ్యాంగ ఉపాధ్యాయుడు ఎం.పద్మనాభంను సత్కరించేందుకు వారు స్వయంగా వేదిక దిగివెళ్లి ప్రశంసా పత్రం అందజేశారు.

# ఉద్యోగులకు గుడ్ న్యూస్!



**అమరావతి (సమయం న్యూస్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ఆయన సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన సమస్యలపై చర్చించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వారికి వివరించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నా ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉన్నామని చెబుతూ పలు వరాలు ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి సీఎం అంగీకరించారు. పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏలు (1-7-2024, 1-1-2025) 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయనున్నారు. పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించనున్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి పునరుద్ధరించనున్నారు. ఇందులో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం చొప్పున ఇవ్వనున్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఏ నెలకు ఆ నెల చెల్లింపులు జరపాలని ఆదేశించారు. ఈ నిర్ణయాలతో ఏటా రూ. 2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది.

**రూ. 30 వేల కోట్లు చెల్లించాం..**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని, 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశామని తెలిపారు. పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ. 30,849 కోట్లు క్లియర్ చేశామన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు తెచ్చిందని, ఆర్థిక సంస్థలతో చర్చించి రూ. 1.50 లక్షల కోట్ల అప్పులపై వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించామని వివరించారు. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానివ్వలేదని, రివర్స్ పీఆర్సీ ఇచ్చారని, రిటైరైన వారికి బెనిఫిట్స్ ఇవ్వలేదని గుర్తుచేశారు. నాడు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారని ఆయన విమర్శించారు. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నామని, సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నామని స్పష్టం చేశారు.

**గత ప్రభుత్వ వేధింపులు మరువలేం..**

సమస్యల పట్ల సానుకూలత కనబరిచిన సీఎం చంద్రబాబుకు ఉద్యోగ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో పీఎఫ్ లోన్లు కూడా ఇవ్వకుండా వేధించడం వల్ల పెళ్లిళ్లను వాయిదా వేసుకున్న పరిస్థితులు ఏర్పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రాభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని వారు వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఏపీపీఎస్సీ, డీఎస్సీలను నాశనం చేసింది వైసీపీనే!

**విమర్శలు చేయడం సిగ్గుచేటన్న మంత్రి నారా లోకేశ్**

**2029లోపు మరో 3 డీఎస్సీలు**

**ఏప్రిల్ నాటికి యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీ**

**విజయవాడ (సమయం న్యూస్):** ఏపీపీఎస్సీ, డీఎస్సీ వ్యవస్థలను వైసీపీ నాశనం చేసిందని, ఇప్పుడు సిగ్గులేకుండా తమపైనే ఆరోపణలు చేస్తోందని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పనిచేసే వారికి విమర్శలు తప్పవని స్పష్టం చేశారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ మధ్య తేడా కూడా తెలియని వారు తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2029లోపు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించేందుకు మరో 3 డీఎస్సీలను నిర్వహిస్తామని లోకేశ్ పునరుద్ఘాటించారు. ప్రభుత్వం నిర్వహించిన తొలి డీఎస్సీని ఎంత పారదర్శకంగా నిర్వహించామో, రాబోయే 3 డీఎస్సీలను కూడా అదే పారదర్శకతతో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తన తల్లి నుంచి క్రమశిక్షణ నేర్చుకున్నానని, తనకు ఆమెనే తొలి గురువని పేర్కొన్నారు. తన తండ్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనకు గౌరవంగా, ఎలాంటి తప్పు చేయకుండా జీవించడం నేర్పించారని తెలిపారు. యూనివర్సిటీల్లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలను వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి భర్తీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# స్థానిక ఎన్నికలకు ముందడుగు!

**3 దశల్లో వార్డుల డీలిమిటేషన్**

**39 పట్టణాల్లో వార్డుల పునర్విభజన**

**సెప్టెంబర్ 15 నాటికి ప్రక్రియ పూర్తి**

**అమరావతి (సమయం న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల దిశగా మరో కీలక ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికల నేపథ్యంలో వార్డుల పునర్విభజనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. పట్టణ స్థానిక సంస్థల్లో వార్డుల హద్దులను పునర్వ్యవస్థీకరించే ప్రక్రియను పూర్తి చేసేందుకు మున్సిపల్ శాఖ కాలపరిమితిని ఖరారు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 39 పట్టణ స్థానిక సంస్థల్లో దశలవారీగా డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. మొదటి దశలో 26 పట్టణ స్థానిక సంస్థల్లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు సెప్టెంబర్ 3ను గడువుగా నిర్ణయించారు. ఇందులో విజయవాడ, తిరుపతి, కర్నూలు, అనంతపురం, నర్సీపట్నం, పార్వతీపురం, సాలూరు, రామచంద్రాపురం, జగ్గయ్యపేట, మాచర్ల, వినుకొండ, సత్తెనపల్లి, మార్కాపురం, చీరాల, చిత్తూరు, ప్రొద్దుటూరు, రాయచోటి, రాయదుర్గం, పుట్టపర్తి, బద్వేల్, నగరి, పుత్తూరు, కదిరి, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, పలమనేరు వంటి పట్టణాలు ఉన్నాయి.

**సెప్టెంబర్ 8, 15న తదుపరి దశలు..**

రెండో దశలో సెప్టెంబర్ 8 నాటికి గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఏలూరు, మచిలీపట్నం, పెడన, పిఠాపురం, ఒంగోలు, గుంటూరు, కడప, ధర్మవరం, తాడిపత్రి, నంద్యాల పట్టణాల్లో వార్డుల పునర్విభజన పూర్తి చేయనున్నారు. ఇక మూడో దశలో చిలకలూరిపేట, నెల్లూరు పట్టణ స్థానిక సంస్థల్లో సెప్టెంబర్ 15 నాటికి ప్రక్రియ ముగిసేలా మున్సిపల్ శాఖ చర్యలు చేపట్టింది. ఈ డీలిమిటేషన్ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తదుపరి ఏర్పాట్లకు మార్గం సుగమం కానుంది.

# గిరిజనుల జన్యు రక్త వ్యాధుల ముందస్తుగానే గుర్తింపు

**రాష్ట్రంలోనే ఉన్న ఏకైక ప్రత్యేక ల్యాబ్‌లో 3 నెలల్లో 121 పరీక్షలు**

**అమరావతి, సెప్టెంబర్ 5:** గిరిజనుల ఆరోగ్యానికి మరింత భరోసా పెరిగింది. గిరిజన ప్రాంతాల్లో తలసేమియా, సికిల్‌సెల్ వంటి జన్యుపరమైన రక్త రుగ్మతలను ముందస్తుగా గుర్తించి, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా విశాఖలోని కేజీహెచ్‌లో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ కంపిటెన్స్ (సీఓసీ) ల్యాబ్ ద్వారా మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది మేలో ప్రారంభమైన ఈ కేంద్రం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ప్రాంతీయ నిర్ధారణ కేంద్రంగా సేవలందిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టితో గిరిజన ప్రాంతాల ప్రజలకు అధునాతన వైద్య సేవలను చేరువ చేస్తున్నారు. ఈ క్రమంలో కేజీహెచ్ లో ఉన్న కేంద్రంలో ఇటీవల వరకు 121 రక్త నమూనాలను పరీక్షించగా, 94 నమూనాల్లో జన్యుపరమైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు లేదా క్యారియర్ స్థితులు గుర్తించారు. పరీక్షలు, జన్యు సలహాలు, క్లినికల్ మేనేజ్‌మెంట్ సేవలను ఉచితంగా అందిస్తున్నారు. పరీక్షల్లో 33 మందిలో సికిల్‌సెల్ ట్రైట్ (హెచ్‌బీఏఎస్) క్యారియర్ స్థితి, 23 మందిలో హోమోజైగస్ సికిల్‌సెల్ వ్యాధి (హెచ్‌బీఎస్ఎస్) గుర్తించారు. మరో 10 మందిలో తలసేమియా ట్రైట్, ఆరుగురిలో తలసేమియా మేజర్, మరో ఆరుగురిలో సికిల్‌సెల్?తలసేమియా కలయిక ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇద్దరిలో హెచ్‌బీడీ, హెచ్‌బీసీ, హెచ్‌బీఈ వంటి అరుదైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు బయటపడ్డాయి. మొత్తంగా పరీక్షించిన 121 నమూనాల్లో 94 అంటే 77.7 శాతం నమూనాల్లో జన్యుపరమైన హీమోగ్లోబిన్ వైవిధ్యాలు లేదా క్యారియర్ స్థితులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. కేంద్రం ఏర్పాటుకు రూ.2.85 కోట్ల విలువైన పరికరాల మౌలిక వసతులు సమకూరాయి. పరికరాల నిర్వహణ కోసం రూ.16.93 లక్షలు వార్షిక నిర్వహణ ఒప్పందాల (ఏఎంసీ) కింద కేటాయించారు. రియాజెంట్లు, పరీక్షా కిట్ల కోసం రూ.45.54 లక్షలు కేజీహెచ్ సీఎఫ్ఎంఎస్ ఖాతాకు జమ చేసి వినియోగానికి కేటాయించారు.

# గురు పరిరక్షణ దీక్ష!

- తాడేపల్లిలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీల నిరసన
- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు డిమాండ్
- మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని పట్టు



**తాడేపల్లి (సమయం న్యూస్):** డీఎస్సీ-2025లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద ఎమ్మెల్సీలు 'గురు పరిరక్షణ దీక్ష' చేపట్టారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్న ఈ దీక్షను పార్టీ పార్లమెంటరీ నేత వైవీ సుబ్బారెడ్డి నల్ల కండువాలు వేసి ప్రారంభించారు. ఈ దీక్షకు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, సీనియర్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్సీపీ నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. డీఎస్సీ అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ వ్యవహారంలో కేంద్ర మంత్రి తప్పుకున్నట్లుగానే, రాష్ట్రంలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ లోకేష్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. కష్టపడి మెరిట్ సాధించిన నిజమైన అభ్యర్థులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ పోరాడుతుందని స్పష్టం చేశారు. మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. జాతిని నిర్మించే గురువుల నియామకంలో కూడా దొంగలు పడ్డారని మండిపడ్డారు. అన్ని ఆధారాలతో సహా డీఎస్సీ మోసాలు నిరూపితమైన తర్వాత ప్రభుత్వం చెప్పే పిట్టకథలు అనవసరమని, లోకేష్ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు.మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. కేవలం కోట్ల రూపాయల కమీషన్లకు కక్కుర్తి పడి విద్యాశాఖ మంత్రి చేసిన అక్రమాలు లక్షలాది మంది నిరుద్యోగుల భవితవ్యాన్ని బలిపీఠం ఎక్కించాయని ఆరోపించారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతా రెడ్డి, ఇసాక్ బాషా తదితరులు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీని కూటమి ప్రభుత్వం దగా డీఎస్సీగా మార్చేసిందని విమర్శించారు. నిబంధనలను తుంగలో తొక్కి, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో అర్హత లేని వారికి దొడ్డిదారిన ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునిస్తూ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జరిగిన అన్యాయాన్ని కప్పిపుచ్చలేరని, దీనిపై సీబీఐ విచారణ వేయాలని, యువతకు సీఎం, డిప్యూటీ సీఎం క్షమాపణ చెప్పాలని నేతలు పట్టుబట్టారు.

# రేపే విజయసాయిరెడ్డి పొలిటికల్ క్లారిటీ

**7న విజయవాడలో మీడియా సమావేశం**

**భవిష్యత్ కార్యాచరణపై వీడనున్న ఉత్కంఠ**

**ఏపీ సమస్యలపై చర్చిస్తానని ట్వీట్**



**విజయవాడ (సమయం న్యూస్):** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రకటన చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 7న మధ్యాహ్నం 1.15 గంటలకు విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఈ మీడియా సమావేశంలో ఆయన కొత్త రాజకీయ పార్టీపై ప్రకటన చేస్తారా లేక సమకాలీన రాజకీయ అంశాలకే పరిమితం అవుతారా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై కూడా ఈ భేటీలో మాట్లాడనున్నట్లు ఆయన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వెల్లడించారు.

# జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలి

**ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్**

**ఏలూరు, సెప్టెంబర్ 5:** ఆటో డ్రైవర్లకు ఈఎస్ఐ , పెన్షన్ తో కూడిన సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఆటోలపై భారీ జరిమానాలు విధించే జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ ( ఎఐటియుసి ) ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల ఏడవ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్స్ అంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే, ఏపీ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాశీ కృష్ణ నేడు ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలన్నింటినీ అమలు చేయాలని , భారీగా పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్, గ్రీన్ టాక్స్ లను 30% తగ్గించాలని , ట్రాఫిక్ నిఘా, ఈ చలానాలనురద్దు చేయాలని, కొత్త వాహనాలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం హామీతో రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం సోమవారం నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళనలో ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

# కొత్త ప్రపంచ పటానికి ఐరాస ఆమోదం!

- భూమి ఉపరితలాన్ని కచ్చితంగా చూపించే ఈక్వల్ ఎర్త్ మ్యాప్
- వ్యతిరేకించిన అమెరికా.. పూర్తిగా పక్కనపెట్టిన ఫ్రాన్స్
- ఖండాల వాస్తవ విస్తీర్ణానికి అనుగుణంగా కొత్త మ్యాప్




**న్యూయార్క్ (సమయం న్యూస్):** ప్రపంచ పటంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. శతాబ్దాలుగా ప్రాచుర్యంలో ఉన్న ప్రఖ్యాత మెర్కేటర్ ప్రపంచ పటానికి బదులుగా భూమి ఉపరితలాన్ని మరింత కచ్చితంగా చూపించే 'ఈక్వల్ ఎర్త్ మ్యాప్'ను ఆవిష్కరిస్తూ ఐక్యరాజ్యసమితి కీలక తీర్మానం చేసింది. ఈ నూతన ప్రపంచ పటంలో ఆఫ్రికా పరిమాణం పెద్దగా కనిపిస్తుండగా ఐరోపా, ఉత్తర అమెరికా సైజు చిన్నగా మారింది. టోగో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి ఐరాసలో 164 దేశాలు మద్దతు పలికాయి. అమెరికా వ్యతిరేకించగా.. ఆరు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఖండాల అసలు విస్తీర్ణానికి అనుగుణంగా రూపొందించిన ఈ కొత్త పటాన్నే వినియోగించాలని సభ్య దేశాలను ఐరాస కోరింది. ఫ్రాన్స్ అయితే మెర్కేటర్ మ్యాప్‌ను పూర్తిగా పక్కన పెట్టనున్నట్లు ప్రకటించింది.

**తేడా ఎందుకొచ్చింది?**

మారిటైం నేవిగేషన్ కోసం 1569లో ప్రముఖ కార్టోగ్రాఫర్ గెరార్డస్ మెర్కేటర్ ప్రపంచ పటాన్ని రూపొందించారు. అప్పటి నుంచి అన్ని దేశాలు దీన్నే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. అయితే గోళాకారంలో ఉండే భూగ్రహాన్ని టు డైమెన్షనల్ మ్యాప్‌లో చూపించినప్పుడు ఉత్తర ప్రాంతాలు పెరిగి, భూమధ్యరేఖ ప్రాంతాలకు కుంచించుకుపోయాయని నిపుణులు తేల్చారు. అందుకే మెర్కేటర్ పటంలో యూరప్, ఉత్తర అమెరికా పెద్దగా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా వాస్తవ పరిమాణం కంటే చిన్నగా కనిపిస్తాయి. ఈ తేడాను తగ్గించేందుకే ఈక్వల్ ఎర్త్ ప్రొజెక్షన్‌ను 2018లో కొందరు కార్టోగ్రాఫర్లు రూపొందించారు. ఇందులో ఖండాల విస్తీర్ణాలను వాటి వాస్తవ పరిమాణాలకు దగ్గరగా చూపించారు. ఫలితంగా ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణాసియా, ఓషియానియా వంటి ప్రాంతాలు మ్యాప్‌లో మరింత పెద్దగా కనిపించాయి.

**వక్రీకరిస్తే తప్పుదోవ పట్టినట్లే..**

ప్రపంచాన్ని ప్రజలు ఎలా అర్థం చేసుకుంటారనే విషయంలో మ్యాప్స్ కీలక పాత్ర పోషిస్తాయని టోగో విదేశాంగ మంత్రి రాబర్ట్ డస్సీ అన్నారు. మ్యాప్స్ విద్యను ప్రభావితం చేస్తాయని, భూమిని వక్రీకరించిన రూపంలో చూపిస్తే.. ఆ తప్పుదోవ పట్టించే అవగాహన తరతరాలకు కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

**అమెరికా అభ్యంతరం..**

అయితే ఐరాస నిర్ణయంపై అమెరికా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచంలో తీవ్రమైన సమస్యలు ఉన్న సమయంలో 16వ శతాబ్దానికి చెందిన మ్యాప్‌లపై చర్చించడం సరికాదని అమెరికా ప్రతినిధి యరీనా ఫెరెన్‌సెవిచ్ విమర్శించారు. అసలైన సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో మ్యాప్ ప్రాజెక్టుల చరిత్ర, పాత్రపై చర్చించడం వల్లే ఐరాస తన విశ్వసనీయతను కోల్పోతోందని ఆమె వ్యాఖ్యానించారు.

# 4 రాష్ట్రాల్లో జనగణన

**ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.



# వైజాగ్ జూకు కొత్త అతిథులు!

**జామ్‌నగర్ ట్రస్ట్‌తో విజయవంతమైన జంతు మార్పిడి**

**తొలిసారిగా కాటన్-టాప్ టామరిన్ల రాక**

**వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**విశాఖపట్నం (సమయం న్యూస్):** ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల (ఐజీజెడ్పీ)కు కొత్త జంతువులు వచ్చాయి. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్‌తో జంతు మార్పిడి కార్యక్రమాన్ని ఐజీజెడ్పీ విజయవంతంగా పూర్తి చేసింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ జంతు మార్పిడిలో భాగంగా విశాఖ జూకు 3 జీబ్రాలు, 4 కాటన్-టాప్ టామరిన్‌లు, 3 రెడ్-నెక్డ్ వాలబీలు, 2 కామన్ మార్మోసెట్‌లు వచ్చాయి. ముఖ్యంగా అంతరించిపోతున్న అరుదైన కాటన్-టాప్ టామరిన్‌లను ఐజీజెడ్పీలో తొలిసారిగా ప్రవేశపెట్టారు. మరోవైపు ఐజీజెడ్పీ నుంచి 3 ఇండియన్ గౌర్‌లు, 4 స్టంప్-టెయిల్డ్ మకాక్‌లు, 2 ఘరియాల్‌లను జామ్‌నగర్‌కు తరలించారు.

**క్వారంటైన్‌లో పర్యవేక్షణ..**

కొత్తగా వచ్చిన అన్ని జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. సెంట్రల్ జూ అథారిటీ (సీజెడ్ఏ) నిబంధనల ప్రకారం ప్రస్తుతం వాటిని తప్పనిసరి పశువైద్య క్వారంటైన్‌లో ఉంచారు. ఈ మార్పిడి కార్యక్రమం ఐజీజెడ్పీలో జంతు సంరక్షణకు, సంతానోత్పత్తి కార్యక్రమాలకు మరింత బలం చేకూరుస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వన్యప్రాణులపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సందర్శకులకు మరింత మంచి అనుభూతిని అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని ఆయన వివరించారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం

**ఉక్రెయిన్‌పై 3రోజుల పాటు దాడులను నిలిపివేసిన పుతిన్**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శాంతి చర్చలకు అమెరికా ప్రతినిధులు మాస్కో చేరుకున్న వేళ రష్యా-ఉక్రెయిన్ తాత్కాలికంగా దాడులను నిలిపివేశాయి. జెలెన్‌స్కీ, పుతిన్ ప్రకటించిన 3 రోజుల విరామం శాశ్వత శాంతి ఒప్పందానికి బాటలు వేస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ప్రకారం, శనివారం అర్ధరాత్రి నుంచి కీవ్‌పై మూడు రోజుల పాటు ఎలాంటి దాడులు జరపకూడదని పుతిన్ ఆదేశించారు. అమెరికా ప్రతినిధుల ఉక్రెయిన్ పర్యటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విట్‌కాఫ్, కుష్నర్ శనివారం మాస్కో చేరుకున్నారు. రష్యా ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్ విమానాశ్రయంలో వారికి స్వాగతం పలికారు. 'వెల్‌కమ్ టు మాస్కో పీస్‌మేకర్స్' అంటూ వారి రాకకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అమెరికా ప్రతినిధులు ఆదివారం కీవ్‌కు వెళ్లే అవకాశం ఉంది. గతంలో వీరు మాస్కోను సందర్శించినప్పటికీ, కీవ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. అమెరికా ప్రతినిధుల పర్యటన సమయంలో ఉక్రెయిన్ కూడా వైమానిక దాడులను నిలిపివేస్తుందని అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు. రష్యా కూడా ఇదే విధంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అయితే అమెరికా ప్రతినిధుల రాకకు ముందు రష్యా కీవ్, బోరిస్పిల్ అంతర్జాతీయ విమానాశ్రయాలపై దాడులు చేసిందని జెలెన్‌స్కీ ఆరోపించారు. అమెరికా ప్రతినిధులు విమానంలో ఉక్రెయిన్‌కు చేరుకునే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ దాడులు జరిగి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తమ డ్రోన్లు, క్షిపణుల కారణంగా రష్యా గగనతలం కూడా ప్రమాదకరంగా మారిందని పేర్కొన్న జెలెన్‌స్కీ, తదుపరి వారంలో రష్యా గగనతలానికి సంబంధించి తమ చర్యలను సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి ప్రవేశించినప్పటికీ, కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం విషయంలో ఇప్పటివరకు స్పష్టమైన పురోగతి కనిపించలేదు. దాదాపు 1,250 కిలోమీటర్ల ఫ్రంట్‌లైన్‌లోనూ ఇరు దేశాల దళాలు పెద్దగా ముందడుగు వేయలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా ప్రతినిధుల మాస్కో, కీవ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. పుతిన్ ప్రకటించిన 72 గంటల దాడుల విరామం చర్చలకు అనుకూల వాతావరణం కల్పిస్తుందా? అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాలు మళ్లీ చర్చల బాట పడతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# 11 రోజుల తర్వాత సజీవంగా మరో ఇద్దరు

**60 ఏళ్ల మహిళను రక్షించిన సిబ్బంది**

**ఇంకా తీవ్రంగా శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు**

**ఇప్పటివరకు 1,344కు చేరిన మృతుల సంఖ్య**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5:** నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విరిగిపడటంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విపత్తు సంభవించి 11 రోజులు గడిచినా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసేందుకు భద్రతా బలగాలు, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఇద్దరిని సజీవంగా రక్షించడం ఆశలు రేకెత్తించింది. ఒక విదేశీయుడిని అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి బయటకు తీసుకురాగా, మరో మహిళను నువాకోట్ జిల్లా బిదూర్‌లో కాపాడారు. మరోవైపు వరదల్లో ఇప్పటివరకూ మృతి చెందిన వారి సంఖ్య 1,344కు చేరింది. భోటేకోశీ వరదల ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న అపర్ త్రిశూలీ-1 ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఓ విదేశీయుడిని నేపాల్ సైన్యం సజీవంగా బయటకు తీసింది. రెస్క్యూ అనంతరం అతడిని హెలికాప్టర్ వద్దకు తరలించి వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో నువాకోట్ పట్టణంలో.., ధ్వంసమైన ఒక ఇంటి నుంచి చండికా శ్రేష్ఠ అనే 64ఏళ్ల వృద్ధురాలిని సహాయ సిబ్బంది ప్రాణాలతో బయటకు తీశారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హెలికాప్టర్‌లో కాఠ్‌మాండ్ తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత దయనీయ స్థితిలో ఉన్న వృద్ధురాలిని దుప్పటిలో చుట్టి ఇంటి నుంచి బయటకు మోసుకెళ్తున్న దృశ్యాలను నేపాల్ సైన్యం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఇప్పటికే శుక్రవారం త్రిశూలీ-3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి ఇద్దరు నేపాలీలను సజీవంగా బయటకు వచ్చారు. వరదల్లో కొట్టుకుపోయిన మృతదేహాలు ఎక్కువగా నీటిలో ఎక్కువకాలం ఉండటం, బురద, శిథిలాల కింద చిక్కుకోవడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా లభించకపోవడంతో మృతుల గుర్తింపు అధికారులకు పెద్ద సవాలుగా మారింది. ఇప్పటివరకు అవసరమైన ప్రక్రియలు, డీఎన్ఏ నమూనాల సేకరణ పూర్తయ్యాక 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేశారు. అయితే గుర్తింపు పూర్తైన 96 మృతదేహాలను మాత్రమే కుటుంబాలకు అప్పగించారు. మృతుల గుర్తింపులో డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి. ఇందుకోసం మృతదేహాల నుంచి సేకరించిన నమూనాలను కుటుంబ సభ్యుల జీవ నమూనాలతో సరిపోల్చాల్సి ఉంటుంది. నువాకోట్‌లోని తాత్కాలిక ఫీల్డ్ ఆసుపత్రిలో డీఎన్ఏ నమూనాల సేకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. నేపాల్ సైన్యం సుమారు 20 హెలికాప్టర్లను సహాయక చర్యలకు వినియోగిస్తోంది. నువాకోట్, రసువా జిల్లాల్లో గాలింపు, రక్షణ, సహాయక సామగ్రి పంపిణీ నిరంతరం కొనసాగుతోంది.

## సంపాదకీయం



# యుద్ధం కాదు.. దౌత్యమే మార్గం!

**ప్రతీకార దాడులతో మరింత రగులుతున్న అమెరికా-ఇరాన్ ఘర్షణ**

**చమురు రవాణా మార్గాలే లక్ష్యాలైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు**

**హోర్ముజ్‌లో ఉద్రిక్తత పెరిగితే ఇంధన ధరలపై తీవ్ర ప్రభావం**

**ఆయుధాలకు విరామమిచ్చి చర్చల బాట పట్టాల్సిన సమయం**

అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ శాంతికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అమెరికా నౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించడం.. ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన క్రూడ్ ఆయిల్ రవాణా నౌకలపై అమెరికా దాడులు చేసినట్లు వార్తలు రావడం.. పరిస్థితి ఎంత వేగంగా అదుపు తప్పుతోందో తెలియజేస్తున్నాయి. ఒకరి దాడికి మరొకరు ప్రతీకారం తీర్చుకునే ధోరణి కొనసాగితే ఇది రెండు దేశాల మధ్య ఘర్షణగానే మిగిలిపోదు. మొత్తం మధ్యప్రాచ్యాన్ని మరో యుద్ధ సుడిగుండంలోకి నెట్టే ప్రమాదముంది. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఖార్గ్ ద్వీపం పరిసరాల్లోనూ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఘటనలపై పూర్తి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉన్నప్పటికీ.. ఇంధన ఉత్పత్తి, రవాణా వ్యవస్థలే ప్రత్యక్ష లక్ష్యాలుగా మారితే దాని ప్రభావం యుద్ధభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశాలపైనా పడుతుంది.

### హోర్ముజ్ రగిలితే.. ప్రపంచానికే సెగ

మధ్యప్రాచ్యంలో జరిగే ప్రతి సైనిక ఘర్షణను ఆ ప్రాంత సమస్యగా మాత్రమే చూడలేం. ప్రపంచ ఇంధన రవాణాలో హోర్ముజ్ జలసంధికి అత్యంత కీలక స్థానం ఉంది. అక్కడ ఉద్రిక్తతలు పెరిగినా, నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా ఎగిసే అవకాశం ఉంటుంది. చమురు ధర పెరిగితే దాని ప్రభావం పెట్రోలు, డీజిల్‌తో ఆగదు. రవాణా వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి ఖర్చులు అధికమవుతాయి. నిత్యావసర వస్తువుల ధరలపై ఒత్తిడి పడుతుంది. విమానయానం నుంచి పరిశ్రమల వరకు అనేక రంగాలు ప్రభావితమవుతాయి. చివరకు యుద్ధ నిర్ణయాలు తీసుకునేది పాలకులైనా.. వాటి ఆర్థిక మూల్యం చెల్లించేది మాత్రం సామాన్య ప్రజలే.

### ప్రతీకారానికి అంతమెక్కడ?

యుద్ధంలో అత్యంత ప్రమాదకరమైన పదం 'ప్రతీకారం'. ఒక దాడికి మరో దాడి.. దానికి ప్రతిగా ఇంకో దాడి.. ఇలా సాగితే ఎక్కడ ఆగాలన్నది చివరకు ఎవరి చేతుల్లోనూ ఉండదు. మొదట పరిమిత లక్ష్యాలపై ప్రారంభమైన సైనిక చర్యలు క్రమంగా కీలక మౌలిక వసతులు, ఇంధన కేంద్రాలు, నౌకాశ్రయాలు, చివరకు జనావాసాలను కూడా ప్రమాదంలోకి నెట్టవచ్చు. దేశాల భద్రతా ప్రయోజనాలను ఎవరూ తక్కువ చేయలేరు. తమ భూభాగం, ప్రజలు, సైనిక బలగాలను రక్షించుకోవడం ప్రతి దేశానికీ హక్కే. కానీ భద్రత పేరుతో అంతులేని ప్రతీకార చక్రాన్ని కొనసాగించడం సమస్యకు పరిష్కారం కాదు. అది మరింత అస్థిరతకు బాట వేస్తుంది.

### చర్చలకు తలుపులు ఇంకా మూసుకుపోలేదు

ఈ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కూడా దౌత్యానికి అవకాశం పూర్తిగా కనుమరుగైందని భావించాల్సిన అవసరం లేదు. తాత్కాలిక ఒప్పందంలోని కట్టుబాట్లను అమెరికా పాటిస్తే తాము కూడా సహకరిస్తామని ఇరాన్ నాయకత్వం చెబుతుండటం చర్చలకు ఇంకా కొంత స్థలం మిగిలి ఉందనే సంకేతంగా చూడాలి. ఇక్కడే అంతర్జాతీయ సమాజం పాత్ర కీలకం. ఐక్యరాజ్యసమితి సహా ప్రభావవంతమైన దేశాలు కేవలం 'సంయమనం పాటించండి' అనే ప్రకటనలకే పరిమితం కాకూడదు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష లేదా మధ్యవర్తిత్వ చర్చలకు వేదికను సిద్ధం చేయాలి. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన భద్రతా హామీలు, ఇంధన రవాణాకు రక్షణ, పరస్పర దాడుల నిలిపివేత వంటి అంశాలపై తక్షణ చర్చలు జరగాలి.

### గెలిచేది ఎవరు.. ఓడేది ఎవరు?

ప్రపంచం ఇప్పటికే యుద్ధాలు, ఆర్థిక అనిశ్చితి, వాణిజ్య ఉద్రిక్తతలు, ఇంధన ధరల ఒత్తిడితో సతమతమవుతోంది. ఈ సమయంలో మధ్యప్రాచ్యంలో మరో దీర్ఘకాలిక యుద్ధం మొదలైతే అది ఏ ఒక్క దేశానికీ మేలు చేయదు. యుద్ధరంగంలో సైనిక విజయం సాధించవచ్చు.. కానీ కోల్పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేం. కూలిపోయిన ఆర్థిక వ్యవస్థలను ఒక్కరోజులో నిలబెట్టలేం. ప్రజల మధ్య పెరిగిన ద్వేషాన్ని ఒక ఒప్పందంతో చెరిపేయలేం. అందుకే అమెరికా, ఇరాన్ రెండూ సంయమనం పాటించాల్సిన సమయం ఇది. క్షిపణికి క్షిపణి.. దాడికి దాడి సమాధానం కాదు. చర్చకు చర్చే సమాధానం. ఆయుధాలు సమస్యను వాయిదా వేయగలవేమో కానీ.. శాశ్వత పరిష్కారాన్ని ఇవ్వగలిగేది దౌత్యమే. యుద్ధంలో ఎవరు గెలిచారన్నది చరిత్ర రాసుకోవచ్చు.. కానీ ప్రతి యుద్ధంలోనూ ముందుగా ఓడిపోయేది మానవత్వమే!

# శతాబ్దం దాటినా.. విద్యా ప్రతిభలో ప్రత్యేక ముద్ర

- శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోదీ
- తరతరాల నాయకులను తీర్చిదిద్దిందంటూ ప్రశంస
- జెన్-జీ విద్యార్థులతో ముఖాముఖి
- మెట్రోలో కళాశాలకు చేరుకున్న మోదీ



**ఢిల్లీ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన ఢిల్లీ విశ్వవిద్యాలయానికి చెందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ.. వందేళ్లుగా విద్యారంగానికి కళాశాల అందిస్తున్న సేవలను ప్రశంసించారు. వ్యాపారం, ప్రజాజీవితం, సామాజిక రంగాల్లో తరతరాల నాయకులను తీర్చిదిద్దడంలో ఈ విద్యాసంస్థ విశిష్టమైన ముద్ర వేసిందని కొనియాడారు. శతాబ్ది ఉత్సవాలకు ముందు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. విద్యా ప్రతిభ, సంస్థాగత నిర్మాణంలో శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. వందేళ్ల ప్రయాణంలో దేశ అభివృద్ధికి అవసరమైన ప్రతిభావంతులను అందించడంలో కళాశాల పాత్రను అభినందించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజునే శతాబ్ది ఉత్సవాలు జరగడం ప్రత్యేకతను సంతరించుకుంది. కళాశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ జెన్-జీ విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ఆలోచనలు, ఆకాంక్షలు, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. యువత తమ అభిప్రాయాలను ప్రధానితో నేరుగా పంచుకునేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యేందుకు ప్రధాని మోదీ ఢిల్లీ మెట్రోలో ప్రయాణించి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. మెట్రో ప్రయాణంలో చిన్నారులు, మహిళలు, ఇతర ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రధానితో మాట్లాడేందుకు అవకాశం రావడంతో ప్రయాణికుల్లో ఉత్సాహం కనిపించింది. కామర్స్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ 1926లో ఆవిర్భవించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత సర్ శ్రీరామ్ చొరవతో ఏర్పాటైన ఈ విద్యాసంస్థ వందేళ్ల ప్రయాణంలో అనేక రంగాలకు ప్రతిభావంతులను అందించింది. పారిశ్రామికవేత్తలు, పరిపాలనాధికారులు, విధాన నిర్ణేతలు, ప్రజాజీవితంలో ప్రముఖులుగా ఎదిగిన అనేక మంది ఈ కళాశాల నుంచి విద్యనభ్యసించారు. శతాబ్ది మైలురాయిని చేరుకున్న శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్.. గత వైభవాన్ని గుర్తుచేసుకుంటూనే కొత్తతరం విద్యార్థులతో మరో శతాబ్దపు ప్రయాణానికి అడుగుపెట్టింది.

# బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

- 10 మందికి శిక్ష ఖరారు
- జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టు తీర్పు
- సెప్టెంబర్ 16న శిక్షల ప్రకటన
- దోషుల్లో ముగ్గురు మహిళలు




**జగదల్‌పూర్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఛత్తీస్‌గఢ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన 2013 జీరమ్ లోయ మావోయిస్టు దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఈ దాడికి సంబంధించిన కేసులో ముగ్గురు మహిళలు సహా మొత్తం 10 మందిని జగదల్‌పూర్ ప్రత్యేక ఎన్‌ఐఏ కోర్టు దోషులుగా నిర్ధారించింది. ప్రత్యేక న్యాయమూర్తి అభయ్ సింగ్ రాజ్‌పుత్ తీర్పు వెల్లడించారు. దోషులకు విధించే శిక్షలను సెప్టెంబర్ 16న ప్రకటించనున్నారు. 2013 మే 25న బస్తర్ ప్రాంతంలోని దర్భా పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీరమ్ లోయ వద్ద ఈ దాడి జరిగింది. కాంగ్రెస్ నిర్వహించిన 'పరివర్తన్ ర్యాలీ' ముగించుకుని నాయకులు తిరిగి వెళ్తుండగా మావోయిస్టులు వారి కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నంద్‌కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, మాజీ ప్రతిపక్ష నేత మహేంద్ర కర్మ, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముద్లియార్‌తో పాటు పలువురు భద్రతా సిబ్బంది, పౌరులు ఈ దాడిలో మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా అనంతరం చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటన అప్పట్లో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నాయకత్వానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

### 101 మంది సాక్షుల విచారణ

తొలుత బస్తర్ పోలీసులు కేసు నమోదు చేయగా.. ఘటన తీవ్రత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించింది. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం ఎన్‌ఐఏ 2014 సెప్టెంబర్‌లో జగదల్‌పూర్ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసింది. విచారణలో భాగంగా 101 మంది సాక్షులను విచారించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన అంశాల పరిశీలనకు రెండు న్యాయ విచారణ కమిషన్లు కూడా ఏర్పాటయ్యాయి. ఏళ్ల తరబడి సాగిన విచారణ అనంతరం తాజాగా 10 మందిని దోషులుగా నిర్ధారిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది. వారికి ఎంత మేర శిక్ష విధించాలన్న అంశంపై ఈ నెల 16న న్యాయస్థానం నిర్ణయం ప్రకటించనుంది.

### తీర్పుతో మళ్లీ రాజకీయ వేడి

కోర్టు తీర్పు నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. దర్యాప్తులో అనేక వాస్తవాలు వెలుగులోకి రాలేదని మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బాఘేల్ ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులకు తగిన భద్రత కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ ఆరోపణలను మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నేత రమణ్ సింగ్ తోసిపుచ్చారు. అత్యంత సున్నితమైన జీరమ్ లోయ దాడి అంశాన్ని కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్ రాజకీయ చరిత్రలో చెరగని విషాదంగా మిగిలిన జీరమ్ లోయ దాడి కేసులో 13 ఏళ్ల తర్వాత వెలువడిన ఈ తీర్పు కీలక ఘట్టంగా మారింది. ఇప్పుడు దోషులకు సెప్టెంబర్ 16న కోర్టు ఎలాంటి శిక్షలు విధిస్తుందన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

# పోలీసులకే సవాల్.. చివరకు కటకటాల్లోకి!

**సీజేపీ నిరసనల ఘటనలో ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్**

**దాడి చేశానంటూ ఇంటర్వ్యూలో వ్యాఖ్యలు**

**బాధితుడి కుమార్తె ఫిర్యాదుతో పోలీసుల చర్య**

**ఆత్మరక్షణ కోసమే దాడి చేశానన్న భరద్వాజ్**

**కోర్టు అనుమతితో ఒక రోజు పోలీసు కస్టడీ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూలైలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల సందర్భంగా జరిగిన దాడి వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. నిరసనల్లో పాల్గొన్న నిషు ఆజాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సామాజిక మాధ్యమ ఇన్‌ఫ్లుయెన్సర్ స్వతంత్ర భరద్వాజ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచిన అనంతరం తదుపరి విచారణ కోసం ఒక రోజు పోలీసు కస్టడీకి తీసుకున్నారు. నిరసనల సమయంలో భరద్వాజ్ తన తండ్రి తలపై ఓ వస్తువుతో దాడి చేశాడని, దాంతో ఆయన గాయపడ్డారని నిషు ఆజాద్ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించి భరద్వాజ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఓ నిరసనకారురాలి తండ్రిపై తాను దాడి చేసినట్లు భరద్వాజ్ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. బాధితుడి తలకు తీవ్ర గాయమై పెద్ద సంఖ్యలో కుట్లు పడి ఉండవచ్చని చెప్పాడు. అంతటితో ఆగకుండా.. అలాంటి దాడి హత్యాయత్నం పరిధిలోకి రావచ్చని పేర్కొంటూనే రాజకీయ పలుకుబడి కారణంగా పోలీసులు తనను అరెస్ట్ చేయలేదని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలతో కూడిన వీడియో వైరల్ కావడంతో పోలీసుల తీరుపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. భరద్వాజ్ వ్యాఖ్యలపై స్పందించిన నిషు ఆజాద్ సామాజిక మాధ్యమంలో వీడియో విడుదల చేశారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు తమ ఫిర్యాదుపై కేసు నమోదు చేయడానికి నిరాకరించారని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు. సామాజిక మాధ్యమాల్లో తనను వేధించడంతో పాటు లైంగిక దాడి బెదిరింపులు కూడా వస్తున్నాయని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై రాజకీయ నేతలు కూడా స్పందించారు. నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, హత్యాయత్నం సహా ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని సంబంధిత నిబంధనలు వర్తిస్తాయా అనే అంశాన్ని పరిశీలించాలని డిమాండ్లు వచ్చాయి. మరోవైపు నిషు ఆజాద్ ఆరోపణలపై పోలీసులు స్పందిస్తూ.. ఘటన సమయంలో బాధితుడికి స్వల్ప గాయాలైనట్లు ప్రాథమికంగా గుర్తించినందున అప్పట్లో కేసు నమోదు చేయలేదని పేర్కొన్నట్లు సమాచారం. భరద్వాజ్ మాత్రం తనపై వచ్చిన ఆరోపణలకు భిన్నమైన వాదన వినిపించాడు. ఘటన సమయంలో తనను 10 నుంచి 15 మంది చుట్టుముట్టారని, ఆ పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసమే దాడి చేయాల్సి వచ్చిందని తెలిపాడు. ప్రస్తుతం పోలీసులు ఇరుపక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లష్కర్ కమాండర్ హతం

**భద్రతా దళాల మెరుపు దాడి**

**బద్గాంలో సంయుక్త ఆపరేషన్**



**శ్రీనగర్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** జమ్మూ కశ్మీర్‌లోని బద్గాం జిల్లా యూస్‌మార్గ్ పర్వత ప్రాంతంలో శనివారం ఉదయం భద్రతా దళాలు జరిపిన మెరుపు ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబాకు చెందిన కీలక పాకిస్థానీ కమాండర్ 'యాసిర్' హతమయ్యాడు. పర్వత ప్రాంతాల్లో ఉగ్రవాదులు సంచరిస్తున్నారనే పక్కా నిఘా సమాచారంతో భారత ఆర్మీకి చెందిన 53 రాష్ట్రీయ రైఫిల్స్, స్పెషల్ ఫోర్సెస్ బలగాలు సంయుక్తంగా తనిఖీ ఆపరేషన్ చేపట్టాయి. భద్రతా బలగాల రాకను గమనించి ఉగ్రవాది జరిపిన కాల్పులకు తిప్పికొట్టిన బలగాలు యాసిర్‌ను అక్కడికక్కడే మట్టుబెట్టాయి. భద్రతా వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. యాసిర్ గతంలో 2025 పహల్గామ్ దాడి సూత్రధారి, లష్కర్ ప్రసిద్ధ ఉగ్రవాది సులైమాన్ మూసా (హాషిమ్ మూసా) గ్రూప్‌లో కీలక సభ్యుడిగా పనిచేశాడు. ఏడాది క్రితం ఆ గ్రూప్ నుంచి విడిపోయిన యాసిర్, యూస్‌మార్గ్ ఎత్తైన పర్వత రహస్య ప్రాంతాల్లో ఉంటూ ప్రత్యేక ఉగ్ర నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు. గత కొంతకాలంగా ఇతని కదలికలపై గూఢచారి వర్గాలు నిఘా ఉంచాయి. ఇటీవల కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర ఘటనలు, ప్లానింగ్‌లలో ఇతని ప్రమేయం ఉందా అన్న కోణంలో విచారణ ముమ్మరం చేశారు. శ్రీనగర్‌లోని దాచీగామ్ అటవీ ప్రాంతంలో సులైమాన్ మూసాను గతంలోనే భద్రతా దళాలు మట్టుబెట్టగా, ఇప్పుడు అతని ప్రధాన అనుచరుడు యాసిర్‌ను కూడా తుదముట్టించడంతో లష్కర్ నెట్‌వర్క్‌కు తీవ్ర విఘాతం కలిగింది.

# భగ్గుమన్న ముడి చమురు ధరలు!

**అమెరికా, ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం**

**భారీగా పెరిగిన బ్రెంట్, డబ్ల్యూటీఐ రేట్లు**

**హోర్ముజ్ జలసంధిలో నౌకా రవాణాపై ఒత్తిడి**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** అమెరికా, ఇరాన్ మధ్య నెలకొన్న తాజా సైనిక ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్‌తో పాటు డబ్ల్యూటీఐ ధరలు వారాంతంలో భారీగా ఎగబాకాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో చమురు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుందనే భయాలు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో నౌకా రాకపోకలపై తీవ్ర ఒత్తిడి కొనసాగుతోంది. ఈ మార్గంలో సరఫరా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత ఏర్పడుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతింటుందన్న భయాలతో ఇంధన మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది.


# పిల్లల్లో స్క్రీన్ టైమ్ తగ్గించండి!

**జాతీయ ఉపాధ్యాయ అవార్డు విజేతలతో ప్రధాని మోదీ**

**పుస్తకాలకే పరిమితం కాకుండా నిజజీవిత నైపుణ్యాలు నేర్పాలి**

**క్రీడలు, సృజనాత్మకత వైపు విద్యార్థులను నడిపించాలని ఉద్ఘాటన**

**న్యూఢిల్లీ (సమయం న్యూస్):** జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులు, విద్యావేత్తలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. న్యూఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లో గల తన నివాసంలో ఆయన ఈ భేటీ నిర్వహించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా మొత్తం 82 మందిని ఈ ప్రతిష్టాత్మక అవార్డులకు ఎంపిక చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి ప్రవర్తన, దైనందిన జీవన విధానంపై కూడా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రధాని సూచించారు. ముఖ్యంగా యువతలో విస్తరిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి, వారిని ఆ ఊబి నుంచి బయటకు తీసుకురావడంలో గురువులు కీలక పాత్ర పోషించాలని కోరారు. పిల్లల్లో మితిమీరిన మొబైల్, స్క్రీన్ వినియోగాన్ని తగ్గించేందుకు క్రీడలు, శారీరక ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలపై ఆసక్తి పెంచాలని సూచించారు. బాల్యంలోని అమాయకత్వం, సహజమైన ఆసక్తి దెబ్బతినకుండా కాపాడుతూ వారిలోని ప్రతిభను వెలికితీయడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా చదువు కేవలం నాలుగు గోడల తరగతి గదికే పరిమితం కాకూడదని, విద్యార్థులకు నిత్యజీవిత నైపుణ్యాలు, శ్రమ గౌరవం వంటి నైతిక విలువలను నేర్పించాలని ప్రధాని పిలుపునిచ్చారు.



# గురువులు దైవంతో సమానం

**సమాజ ప్రగతికి బాటలు వేస్తున్న ఉపాధ్యాయులు సేవలు చిరస్మరణీయం,**

**డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘన నివాళులు**

**ఏలూరు, సెప్టెంబరు 05:** విద్యార్థులు భవిష్యత్తును బంగారుబాటలుగా తీర్చిదిద్దుతున్న గురువులు దైవంతో సమానం అన్నారు ఏలూరు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి. ఉపాధ్యాయదినోత్సవం సందర్భంగా 33 మంది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు, శాలువాలు, పండ్లను ఇచ్చి ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్తు సమావేశం మందిరంలో భారతరత్న భారత మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లు పూలదండలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆదర్శ గురువులు భారతరత్న మాజీ రాష్ట్రపతి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులందరికీ ఆదర్శనీయులు అన్నారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా, ఉపరాష్ట్రపతిగా అనంతరం రాష్ట్రపతిగా పనిచేసి విద్యావ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహనీయులు పుట్టినరోజుని మనందరం ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులు జ్ఞానాన్ని అందించి సంఘంలో ఒక గౌరవనీయ వ్యక్తిగా తీర్చిదిద్దడంలో గురువులు పాత్ర అపారమైనదని అన్నారు. విద్యార్థులకు కేవలం చదువు, జ్ఞానం మాత్రమే కాకుండా సమాజంలో జీవించడానికి కావలసిన సోషల్ స్కిల్స్, ధైర్యము, సహనం, ఓర్పు ఇలాంటి ఎన్నో అమూల్యమైనవి విద్యార్థులకు అందిస్తున్నారని అన్నారు. జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు విలువలు నేర్పించడం చాలా అవసరమని అన్నారు. క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను అందిస్తూ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు సేవలు అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయులు సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం ద్వారా మరింత నిబద్ధతతో పనిచేసే స్ఫూర్తి కలుగుతుందన్నారు. విద్యార్థి దశలో మంచి కన్నా చెడును త్వరగా గ్రహిస్తారని ఈ విషయాన్ని గమనించి మంచి మార్గం వైపు మళ్ళించాలన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు విషయ పరిజ్ఞానాన్ని నేర్పించి వారు ఆకలింపు చేసుకునేలా గురువులు తీర్చిదిద్దాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య( చంటి) మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు తర్వాత సరైన మార్గంలో నడిపించేది గురువు ఒక్కరేనని అన్నారు. ఆ గురువుకి మనమందరం కూడా శిరస్సు వంచి నమస్కరించాలని అన్నారు. గురువు అంటే దైవంతో సమానం అని, విద్యార్థికి సరైన నడకని బాటని వేసి మంచి సంస్కృతి సంప్రదాయాలను అలవర్చి ఉత్తమ విద్యార్థిగా తీర్చిదిద్దే గురువు పాత్ర చాలా అమోఘమైనదని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, పరీక్షలు నిర్వహణ సహాయ కమీషనరు ఆర్.ఆశ, ఉప విద్యాశాఖ అధికారులు డా.పి.యస్.సుధాకర్, యన్.రవీంద్ర భారతి, జిల్లా పరిషత్తు, విద్యాశాఖ అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# విపత్తు సమయంలో సిబ్బంది సేవలు ఎనలేనివి

**వాటర్ బ్రౌజర్ అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించిన ఏలూరు ఎమ్మెల్యే**

**ఏలూరు, సెప్టెంబర్, 5:** విపత్తు సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ మరియు అగ్నిమాపక దళం సిబ్బంది అందించే సేవలు ఎనలేనివని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) చెప్పారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో 80 లక్షల రూపాయల 15వ ప్రణాళిక సంఘం నిధులతో ప్రభుత్వం అందించిన అధిక నీటి సామర్థ్యం కలిగిన వాటర్ బ్రౌజర్ అగ్నిమాపక వాహనాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో రాష్ట్ర విపత్తు నివారణ, అగ్నిమాపక దళం సిబ్బంది అందించే సేవలతో ఎటువంటి ప్రాణ, ఆస్థి నష్టాలు కలగకుండా రక్షించుకోగలుతున్నామన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా కొణిజేటి వెంకట శేషారావు!

- **ప్రకాశం జిల్లా స్థాయిలో ప్రతిష్టాత్మక పురస్కారం ప్రదానం**
- **విద్యా, సామాజిక రంగాల్లో ముప్పై ఏళ్లకు పైగా విశేష సేవలు**
- **ప్రశంసల జల్లు కురిపించిన పూర్వ విద్యార్థులు, సహచరులు**

**ఒంగోలు (సమయం ప్రతినిధి):** ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో కొండేపి మండలం కోరు ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహిళా కళాశాల పీజీటీ కెమిస్ట్రీ లెక్చరర్ కొణిజేటి వెంకట శేషారావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వరించింది. ఆయన గత ముప్పై ఒక్క ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ముఖ్యంగా కొండేపి మండలంలోని ముప్పవరం, కోరు ఉప్పలపాడు జెడ్పీ పాఠశాలల్లో పద్దెనిమిది సంవత్సరాలు పనిచేశారు. కోయవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో, మండల రిసోర్స్ పర్సన్‌గా ఐదేళ్ల పాటు సేవలందించారు.

## పాఠశాలల అభివృద్ధి.. పచ్చదనం

శేషారావు తాను పనిచేసిన కాలంలో మూగచింతల, తాటాకుల పాలెం, జార్లపాలెం, కట్టుబడిపాలెం, రేగుల గడ్డ పాలెం, నెన్నూరుపాడు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయించారు. మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు సహకారంతో 1998-2002 మధ్య మండల రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తూ 26 స్కూల్ భవనాలు కట్టించారు. ముప్పవరం, కోరు ఉప్పలపాడు, కొత్తపట్నం పాఠశాలల అభివృద్ధికి విశేష కృషి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని నూట యాభైకి పైగా వృక్షాలుగా మలిచారు. పాఠశాల, క్రీడల అభివృద్ధికి సొంతంగా మూడు లక్షల రూపాయలకు పైగా వెచ్చించారు.

## స్కౌట్స్ విభాగంలో జాతీయ స్థాయి గుర్తింపు

భారత్ స్కౌట్స్, గైడ్స్‌లో శిక్షణ పొందిన ఆయన.. మధ్యప్రదేశ్ పచ్మడీలోని జాతీయ ప్రధాన కార్యాలయంలో హిమాలయ వుడ్ బ్యాడ్జ్ కోర్సు పూర్తి చేసిన జిల్లా తొలి వ్యక్తిగా నిలిచారు. స్కౌట్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. ఆయన శిక్షణలో నేతాజీ స్కౌట్ ట్రూప్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాజ్య పురస్కార్ (గవర్నర్) సర్టిఫికెట్లు పొందారు. రాజస్థాన్ రాష్ట్రం పాలిలో జరిగిన 18వ నేషనల్ జంబూరీలో విశేష ప్రతిభ కనబరిచి పురస్కారాలు సాధించారు. విద్యార్థులతో పాటు స్కౌట్ ఉపాధ్యాయులకు కూడా ఆయన శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం భారత్ స్కౌట్స్, గైడ్స్ ప్రకాశం జిల్లా ట్రైనింగ్ కమిషనర్‌గా, యువ ఆపద మిత్ర జిల్లా కోఆర్డినేటర్‌గా సేవలు అందిస్తున్నారు.

## సేవా కార్యక్రమాల్లో ముందువరుసలో..

జిల్లా సేవా భారతి సెక్రటరీగా ఉంటూ సమాజ సేవలో శేషారావు చురుగ్గా పాల్గొంటున్నారు. మురికివాడల్లోని విద్యార్థుల కోసం దాతల సాయంతో 40 ట్యూషన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఆయన ప్రేరణతో ఎంతోమంది నేత్రదానం చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి ఆపదలో ఉన్న వారికి రక్తం అందేలా చేశారు. ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు డాక్టర్లు, ఇంజనీర్లు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉన్నతోద్యోగులుగా స్థిరపడ్డారు. శేషారావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. సుసన్న కుమార్, విద్యా కమిటీ చైర్మన్ రాఘవ శర్మ, సహచర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి అభినందించారు.



# అమెరికా, ఇరాన్ వార్ పీక్స్!

- **యూఎస్ యుద్ధ నౌకలపై బాలిస్టిక్ మిస్సైళ్లతో ఇరాన్ దాడి**
- **తప్పించుకున్న అమెరికా నౌకలు.. ప్రతీకార దాడులు షురూ**
- **మూడు ఇరాన్ క్రూడ్ ఆయిల్ క్యారియర్లను లక్ష్యంగా చేసుకున్న యూఎస్**



**వాషింగ్టన్/టెహ్రాన్ (సమయం న్యూస్):** అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు శనివారం మరింత తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) రెండు అమెరికా నౌకాదళ యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన మూడు ముడి చమురు రవాణా నౌకలపై అమెరికా బలగాలు మెరుపు దాడులు నిర్వహించినట్లు వెల్లడించింది.

## దాడులను తప్పించుకున్న యూఎస్ నౌకలు..

సెంట్‌కామ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రాంతీయ జలాల్లో ఉన్న ఒక అమెరికా విమాన వాహక నౌకతో పాటు గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్‌ను ఇరాన్ క్షిపణులు లక్ష్యంగా చేసుకున్నాయి. అయితే ఆ రెండు నౌకలు ఈ దాడులను సురక్షితంగా తప్పించుకున్నాయి. ఈ దాడిలో అమెరికా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించింది. అనంతరం కొద్దిసేపటికే రంగంలోకి దిగిన అమెరికా సైన్యం.. మూడు ఇరాన్ క్రూడ్ ఆయిల్ క్యారియర్లపై లక్షిత దాడులు చేపట్టింది.

## ఖార్గ్ ఐలాండ్ వద్ద ఆయిల్ ట్యాంకర్‌పై క్షిపణులు..

ఇదే సమయంలో ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖార్గ్ ఐలాండ్ సమీపంలో ఒక చమురు ట్యాంకర్ అమెరికా క్షిపణుల దాడికి గురైనట్లు ఇరాన్‌కు చెందిన తస్నీమ్ వార్తా సంస్థ తెలిపింది. నాలుగు క్షిపణులు ట్యాంకర్‌ను తాకినట్లు పేర్కొంది. వెంటనే అప్రమత్తమై సిబ్బందిని సురక్షితంగా తరలించారని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. అయితే ఈ ఘటనపై ఇరాన్ ప్రభుత్వం లేదా అమెరికా సెంట్‌కామ్ నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

## మార్కెట్లకు చమురు సెగ..

ఖార్గ్ ఐలాండ్ ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత వ్యూహాత్మక కేంద్రంగా ఉంది. ఈ కీలక ప్రాంతంలో సైనిక దాడులు కొనసాగితే ఇరాన్ చమురు ఉత్పత్తితో పాటు ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో హోర్ముజ్ జలసంధి ద్వారా సాగే నౌకా రవాణా గణనీయంగా తగ్గింది. ఈ తాజా పరిణామాలు అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్లను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తుండగా, అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సోమశిల హైలెవల్ కెనాల్ పూర్తి చేస్తాం!

- **మర్రిపాడుకు సాగునీరు అందిస్తామన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**
- **డీసీపల్లిలో రూ. కోటితో కోదండరామస్వామి ఆలయ పనులకు శంకుస్థాపన**
- **మండలంలో ఆలయాల అభివృద్ధికి రూ. 8.12 కోట్లు కేటాయింపు**

**మర్రిపాడు (సమయం న్యూస్):** సోమశిల హైలెవల్ కెనాల్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, మర్రిపాడు మండలానికి సాగునీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని డీసీపల్లి గ్రామంలో రూ. కోటి నిధులతో చేపట్టనున్న శ్రీ కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.



## ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం..

మర్రిపాడు మండలంలోని పురాతన దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 8.12 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 800 దేవాలయాల పునర్నిర్మాణం కోసం రూ. 1,100 కోట్లతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసిందని మంత్రి ఆనం వెల్లడించారు.



# అద్దేపల్లి జీవితం.. ఒక సాహిత్యోద్యమం

## నేడు అద్దేపల్లి రామమోహనరావు జయంతి

**తెలుగు సాహిత్య చరిత్రలో చెరగని సంతకం ఆయనది. తెలుగు సాహిత్యంతో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఆయనది. సాహిత్య పరంగా వందలాది యువకులకు స్ఫూర్తినిచ్చి, వారి రచనా పోకడలకు మెరుగులు దిద్దిన సాహితీ వేత్త ఆయన. ఎందరో యువ కవులను ప్రోత్సహించి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి, అసలు సిసలైన సాహితీ సరుకును అందించేందుకు దోహద పడిన సాహితీ కర్మాగారం ఆయన. భావజాలం ఏదైనా, భావుకత విషయమే ప్రధానమని నమ్మి, కవులలో పెద్దా, చిన్నా, సాంప్రదాయ, ఆధునిక, పద్య గద్య వచన తేడా లేకుండా అందరితో సమన్వయం, సంబంధం కలిగి, సమాదరించిన గొప్ప మనసు ఆయనది. నమ్మిన బాటలో ముక్కు సూటిగా కొనసాగిన మనస్తత్వం ఆయనది. వేలాదిగా అభిమానులు, అనుయాయులు, అనుచరులు కలిగి ఉన్న మార్గదర్శకుడు. ఆయనే తెలుగు సాహిత్యంలో చెరగని సంతకం చేసిన అద్దేపల్లి రామమోహన రావు. అద్దేపల్లి అర్ధ శతాబ్ది సాహితీ ప్రస్థానంలో సుమారు 30 పుస్తకాల్ని వెలువరించి, వందకు పైగా ముందు మాటలు వ్రాసి, వివిధ సభల్లో రెండువేలకు పైగా అధ్యక్షోపన్యాసాలు చేసి, వందలాది పుస్తకాల సమీక్షలు చేసి, వందల తెలుగు గజల్స్ ను వ్రాసి, గానం చేసిన సాహితీ కృషీవలుడు. తెలుగులో మినీ కవితా ప్రక్రియను చేపట్టిన కవుల్లో అద్దేపల్లి ఒకరు. నిజానికి అద్దేపల్లి జీవితం ఒక సాహిత్యోద్యమం.**

రామమోహనరావు 1936, సెప్టెంబరు 6న బందరు శివార్లలోని చింతగుంట పాలెంలో పుట్టువు నొందారు. అక్కడే ప్రాథమిక విద్యను అభ్యసించి, సమీపంలోని జవారుపేట హిందూ హైస్కూల్‌లో చదివారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతినుండి ఎం.ఏ.పూర్తి చేసి బందరు హిందూ కళాశాలలో కొంతకాలం ట్యూటర్‌గా, లెక్చరర్‌గా విధులు నిర్వర్తించారు. కొంతకాలం నందిగామలో ఉద్యోగం చేసి 1972లో కాకినాడ చేరుకుని అక్కడే స్థిరనివాసి అయినారు. ప్రారంభ దశలో చందోబద్ధమైన కొన్ని వందల పద్యాల్ని రచించారు. 1960 లో తొలికవిత కృష్ణాపత్రికలో ప్రచురితం అయింది. కాగా తాను విశ్వసించే హేతువాదం, అభ్యుదయ, ప్రగతిశీల భావాలకు గిరిగీసుకున్న సంప్రదాయ ఛందో బద్ధ రీతులు కాక, స్వేచ్ఛాయుత వచన కవిత్వమే సరైనదని భావించి, వచన కవితా మార్గాన్నే పయనించ సిద్ధమైనారు, అలాగే ప్రయాణం కొనసాగించారు. ఆవంత్స సోమసుందర్, శివ సాగర్, చెరబండరాజు, నగ్నముని, కె.శివారెడ్డి వంటి విప్లవ కవుల ప్రభావంతో విప్లవ సాహిత్య రంగాన్ని ఎంచుకున్నారు. మసక బారుతున్న మానవ జీవనంపై కవిత్వం వ్రాసిన తొలి తెలుగుకవి అద్దేపల్లి. ఆయన కవిత్వ సంపుటాలలో అంతర్జ్వాల (1970), రక్త సంధ్య (1978), గోదావరి నా ప్రతిబింబం (1992), పొగచూరిన ఆకాశం, సంఘం శరణం గచ్ఛామి, మెరుపు పువ్వు, గీటురాయి వంటివి పేరెన్నిక గన్నవి. అలా వచన కవిత్వానికి పెద్దపీట వేసి, మినీ కవితల ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచి గొప్ప ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆయన అనేక కవితలు వివిధ భాషలలోకి అనువదింప బడ్డాయి. పద్యాలు, గేయాలను శ్రావ్యంగా ఆలపించడమే కాకుండా, స్వయంగా తెలుగులో వందల గజల్ లను రచించడమే కాక, రాగయుక్తంగా ఆలపించి అనేక సభలను రంజింప చేశారు. అద్దేపల్లి నిరంతర సంచార అభిలాషియై, తెలుగు సీమలో అనేక ప్రదేశాలు చుట్టి, తన సాహితీ క్షేత్రాన్ని విస్తరింప చేశారు. విమర్శకునిగా ఆయన స్థానం ప్రత్యేకం. తమదైన శైలిలో... శ్రీశ్రీ మహా ప్రస్థానంపై రాసిన మొదటి విమర్శనా గ్రంథం పలువురి ప్రశంసా పాత్రమైంది. కుందుర్తి వచన కవితా వైభవం, స్త్రీవాద కవిత్వం..ఒక పరిశీలన, గుర్రం జాషువా కవితా సమీక్ష, తెలుగు కవిత్వంపై ఆధునికత, అభ్యుదయ విప్లవ కవిత్వాలు- సిద్దాంతాలు, శిల్పరీతులు వంటి వివిధ విమర్శనా గ్రంధాలు అద్దేపల్లి కలం నుండి వెలువడ్డాయి. 2001లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాహితీవిమర్శకు గాను ప్రతిభా పురస్కారం, ఆయన రాసిన "పొగచూరిన ఆకాశం" కవితా సంపుటికి, తమిళనాడుకు చెందిన ప్రముఖ రచయిత చిన్నప్ప భారతి ఆద్వర్యంలో సాహిత్య పురస్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, ఉమర్ ఆలీషా అవార్డు, సరసం అవార్డు, తిలక్ అవార్డు ఆంధ్రసారస్వత సమితి జీవన సాఫల్య పురస్కారం, తంగిరాల అవార్డు, జాషువా అవార్డు పులికంటి సాహితీ పురస్కారం, బోయి భీమన్న సాహితీ పురస్కారం ఆయనను వరించిన వాటిల్లో కొన్ని. "సాహితీ సంచార యోధుడు"గా, బిరుదాంకితులైన అద్దేపల్లి తెలుగు సాహితీ క్షేత్రానికి సుసంపన్నం చేసి, తనదైన ముద్ర వేసి, 2016, జనవరి 13న తేదీ ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పరమాణు సిద్ధాంతకర్త జాన్ డాల్టన్

## నేడు జాన్ డాల్టన్ జయంతి

ద్రవ్యం, పరమాణువులు, రసాయనిక చర్యలపై అనేక పరిశోధనలు చేసి ఆధునిక పరమాణు సిద్ధాంతానికి పునాదులు వేసిన ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త, వాతావరణ శాస్త్రవేత్త మరియు భౌతిక శాస్త్రవేత శాస్త్రవేత్త, జాన్ డాల్టన్. రసాయన శాస్త్రం అభివృద్ధికి, పదార్థాల న్నింటికీ విద్యుత్ ధర్మం ఉందనడానికి, అణుశక్తి వినియోగానికి డాల్టన్ పరమాణు సిద్ధాంతమే బాటలు పరిచింది. ఆయన వాతావరణ శాస్త్రం, వర్ణాంధత్వం మీద కూడా పరిశోధనలు చేశాడు. అణు సిద్ధాంతానికి ఆధునికతను సమకూర్చినవాడుగా చంద్రుడి మీద ఒక క్రేటర్ కు ఈయన పేరు పెట్టారు.

ఇంగ్లండ్ లోని ఈగల్స్ ఫీల్డ్ గ్రామంలో ఓ పేద చేనేత కార్మికుడి అయిదుగురి సంతానంలో ఒకడుగా 1766 సెప్టెంబరు 6న పుట్టిన డాల్టన్ చిన్నతనంలోనే సైన్స్, గణితం, ఇంగ్లిషుల్లో పట్టు సాధించాడు. వాతావరణ శాస్త్రం (మెట్రియాలజీ)పై ఆసక్తి పెంచుకుని పరిశీలనకు కావలసిన పరికరాలను స్వయంగా రూపొందించు కున్నాడు. వాతావరణ పీడనం, ఉష్ణోగ్రత, గాలి వేగం, తేమ లాంటి విషయాలను రోజూ నమోదు చేసుకోవడాన్ని ప్రారంభించి జీవితాంతం కొనసాగించాడు. చనిపోయే చివరి రోజు వరకు ఆయన నమోదు చేసిన అంశాలు 2 లక్షల పైమాటే అంటే ఆయన నిర్విరామ కృషి అర్థం అవుతుంది. స్కూల్లో పిల్లలకు చదువు చెప్పడం, తండ్రికి సాయపడడంతో పాటు లాటిన్, గ్రీకు భాషలు నేర్చుకున్నాడు. పాఠశాల ఉపాధ్యాయుడుగా, వాతావరణ శాస్త్రవేత్తగా, రంగు అంధత్వంపై నిపుణుడుగా రూపుదిద్దుకున్నా,

ఇరవై ఏడేళ్లకల్లా కళాశాల అధ్యాపకునిగా చేరినా పరిశోధనలు మానలేదు. మాంచెస్టర్ లిటరరీ అండ్ ఫిలాసఫికల్ సొసైటీ, ఆయనకు ఉత్తేజపరిచే మేధో వాతావరణం మరియు ప్రయోగశాల సౌకర్యాలను అందించింది. ఇంగ్లండ్‌లోని కొండలు, లోయలు, పట్టణాలు తదితర ఎన్నో ప్రాంతాల్లో వాతావరణాన్ని పరిశీలించి, ఎక్కడైనా గాలి సమ్మేళనం (ఓశీఎజూశీంర్‌ఱశీఅ) ఒకేలా ఉందని తేల్చుకున్నాడు. అలా ఆయన చేసిన పరిశోధనల ఫలితంగా 'పాక్షిక పీడన సిద్ధాంతం' (ఽష్ట్రవశీతీఎ శీట ఎబీతీఎుశ్రీూతీవంబతీవం) చెప్పగలిగాడు. ఆపై రసాయన చర్యలపై దృష్టి సారించి పరమాణు సిద్ధాంతాన్ని అందించాడు. పరమాణువులు ఎలా సంపర్కం చెందుతాయో తెలిపేలా మూలకాలకు డాల్టన్ ఏర్పరిచిన సంకేతాలకు ఇప్పటికీ అదే ప్రాధాన్యత ఉంది. అలాగే మూలకాలు సమ్మేళనంగా ఏర్పడే అంశానికి సంబంధించి 'నిర్దుష్ట అనుపాత నియమం' (Law of Definite proportions), బహుళ అనుపాత నియమం (Law of multiple proportions) నిర్వచించాడు. వాతావరణ పీడనాన్ని సూచించే భారమితి (Barometer), తేమని తెలిపే హైగ్రోమీటర్, మేఘాలు ఏర్పడే విధానాలు, వర్షపాతం, బాష్పీభవనం, తుషారస్థానం (Dew Point) గురించిన పరిశోధనలు డాల్టన్ చేసినవే. తన పరిశోధనలకు ఎన్నో డాక్టరేట్లు, పురస్కారాలు పొందాడు. లావోయిసియర్, అతని అనుచరులు భావించినట్లు గాలి ఒక విశాలమైన రసాయన ద్రావకం కాదని , ఒక మిశ్రమంలో ప్రతి వాయువు ద్వారా వచ్చే ఒత్తిడి స్వతంత్రంగా ఉండే ఒక యాంత్రిక వ్యవస్థ ఇతర వాయువుల ద్వారా ఒత్తిడి, మరియు మొత్తం పీడనం ప్రతి వాయువు పీడనాల మొత్తం అని వివరించాడు. ఏకపక్ష వ్యవస్థను ఉపయోగించి, సమ్మేళనాల శాతం కూర్పుల నుండి పరమాణు బరువులను లెక్కించడం కొన సాగించాడు. మిళితం చేయగల రెండు అంశాలు ఉంటే, వాటి కలయికలు ఒక నిర్దిష్ట క్రమంలో సంభవిస్తాయని పేర్కొన్నాడు. డాల్టన్ తన అణు సిద్ధాంతాన్ని 1808 లో ప్రతిపాదించాడు; సిద్ధాంతాన్ని శాస్త్రవేత్తలు విశ్వవ్యాప్తంగా ఆమోదించడానికి మరో శతాబ్దం గడిచింది.



డాల్టన్ పరమాణు సిద్ధాంతం ప్రకారం... అన్ని పదార్థాలను విడదీయరాని మరియు నాశనం చేయలేని అణువులను విభిన్న ద్రవ్యరాశి మరియు లక్షణాలతో కలిగి ఉంటుందని సూచించింది. దీని కలయిక వాటి మూలకాల యొక్క భౌతిక స్వభావాన్ని నిర్ణయిస్తుంది. ఒక మూలకం యొక్క అన్ని పరమాణువులు ఒకేలా ఉ ంటాయి. వివిధ మూలకాల అణువులు పరిమాణం మరియు ద్రవ్యరాశిలో విభిన్నంగా ఉంటాయి. పరమాణువుల విభిన్న సంఖ్యా కలయికల ద్వారా సమ్మేళనాలు ఉత్పత్తి చేయబడతాయి. ఆంటోయిన్ లావోసియర్ మరియు జోసెఫ్ ప్రౌస్ట్ రచనలను అధ్యయనం చేయడం, విస్తరించడం ద్వారా డాల్టన్ బహుళ నిష్పత్తిలో నియమాన్ని అభివృద్ధి చేశారు (మొదటి సారిగా 1803 లో సమర్పించారు). వివిధ ఉష్ణోగ్రతలలో గాలి ద్వారా నీటి ఆవిరిని శోషించడం, బాష్పీభవనం, వాయువుల ఉష్ణ విస్తరణపై ఆయనచేసిన కృషి, డాల్టన్ యొక్క పాక్షిక ఒత్తిళ్ల నియమావళికి దారితీసింది. ఇది అణువు యొక్క ఆధునిక సిద్ధాంతం 1803 లో అతని ప్రతిపాదనకు తెలియ జేసింది. ప్రయోగాత్మకంగా, అనుభవ పూర్వక పద్ధతిలో ఫలితాలను పరీక్షించడం ద్వారా డాల్టన్ తన నిర్ధారణలకు చేరుకున్నందున, ఇది అణువు యొక్క మొదటి నిజమైన శాస్త్రీయ సిద్ధాంతాన్ని గుర్తించ బడింది. శాస్త్రవేత్తగా తన ప్రారంభ కెరీర్‌లో, డాల్టన్ రంగు అంధత్వాన్ని కూడా పరిశోధించాడు . ఈ విషయం అతనికి ప్రత్యక్ష అనుభవం ద్వారా సుపరిచితం. పుట్టినప్పటి నుండి ఈ పరిస్థితి అతని మరియు అతని సోదరుడిని ప్రభావితం చేసింది కాబట్టి, అది తప్పనిసరిగా వంశపారంపర్యంగా ఉండాలని డాల్టన్ సిద్ధాంతం చేశాడు. అతను తన సొంత కంటి కణజాలం యొక్క జన్యు విశ్లేషణలో ఆకుపచ్చ రంగును గ్రహించడం కోసం ఫోటోరిసెప్టర్‌ను కోల్పోతున్నట్లు వెల్లడించి నప్పుడు తన సిద్ధాంతాన్ని నిజమని నిరూపించాడు. ఎరుపు – ఆకుపచ్చ రంగు అంధత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఆయన చేసిన కృషి ఫలితంగా, ఈ పరిస్థితిని ఇప్పటికీ "డాల్టోనిజం" అని పిలుస్తారు. డాల్టన్ నిరాడంబరమైన ఉనికిని కొనసాగించాడు. అనేక గౌరవాలను అందు కున్నాడు. డాల్టన్ 1844 లో మరణించే వరకు విస్తృత విషయాలపై తన శాస్త్రీయ పరిశోధనను కొనసాగించాడు. అతను మాంచెస్టర్ లిటరరీ అండ్ ఫిలాసఫికల్ సొసైటీలో క్రియాశీల సభ్యుడిగా,1822 నుండి, రాయల్ సొసైటీలో ఫెలోగా ఉన్నాడు. మాంచెస్టర్‌లో అతని అంత్యక్రియల ఊరేగింపులో 40,000 మందికి పైగా ప్రజలు ఊరేగారంటే ప్రజలకు ఆయనపై గల అభిమానం స్పష్టం అవుతుంది..

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు గీత కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి

## నేడు గేయ గంధర్వుడు వడ్డేపల్లి కృష్ణ వర్ధంతి

తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 – సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉ న్నాయి.

1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి.

1968లో "స్రవంతి", "కృష్ణా పత్రిక"లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది. 'కవికల్యాణం', 'గడ్డిపువ్వు', 'గాంధీ', 'మూడుపూలు ఆరుకాయలు', 'సంక్రాంతి లక్ష్మి', 'స్వదేశీయం', 'వివేకానంద విజయం', 'ఆమ్రపాలి', 'బతుకమ్మ', 'జయజయహే తెలంగాణ', 'రమణీయ రామప్ప' వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు.

ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. "ఎందుకో ఈ కళ్లలో", "వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా", "తల్లి నీ చూపే దేవుడయ్యేను" వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. 'చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు. ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో "భక్త కవి పోతన", "భారతీయ సంస్కృతీ శిఖరాలు" ముఖ్యమైనవి. "గోభాగ్యం" లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు.

అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి.



సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది.

సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు 'నంది అవార్డు', 'తెలుగు యూనివర్శిటీ గౌరవ సత్కారం', సినారె అవార్డు, మల్లాది' స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి' లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి. ఆయనకు "గేయ కిరీటి", "లలితశ్రీ", "కవన ప్రజ్ఞ" వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, "పాడుతా తీయగా" లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు.

వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, "కరీంనగర్ క్షేత్రాలు" అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. "వెలుగచ్చింది" అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్పణంగా "జయజయహే తెలంగాణ" అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు.

ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు. ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి.

వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేధనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




# క్రికెట్ పిచ్‌పై భారత్-జపాన్ దోస్తానా!

**టోక్యో, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** భారత్, జపాన్ దేశాల మధ్య 75 సంవత్సరాల ద్వైపాక్షిక దౌత్య సంబంధాల వేడుకల సందర్భంగా ఇరుదేశాల పురుషుల జట్లు ప్రత్యేక అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఈ చారిత్రాత్మక పోరు కోసం 'సుజుకి కప్' నిర్వహించనున్నట్లు జపాన్ క్రికెట్ అసోసియేషన్, బిసిసిఐ సంయుక్తంగా అధికారికంగా ప్రకటించాయి. జపాన్‌లోని తోచిగి ప్రిఫెక్చర్‌లో ఉన్న సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా సెప్టెంబర్ 22న ఈ మ్యాచ్ జరగనుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకాఇచిల మధ్య జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందం మేరకు 'స్పోర్ట్స్ 75' పేరుతో ఈ క్రీడా సంబంధాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు కూడా ఈ భాగస్వామ్యం ఊతమివ్వనుంది. అదే సమయంలో జపాన్ వేదికగా జరిగే ఆసియా గేమ్స్‌లో పాల్గొనే భారత పురుషుల జట్టులోని స్టార్ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ వంటి ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనున్నారు. ఈ సందర్భంగా బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ.. ఈ అరుదైన మ్యాచ్‌లో భాగస్వామి కావడం బిసిసిఐకి ఎంతో సంతోషాన్ని ఇస్తోందని, తూర్పు ఆసియా ప్రాంతంలో క్రికెట్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ఇదొక గొప్ప అవకాశమని పేర్కొన్నారు. జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈఓ నవోకి అలెక్స్ మియాజీ మాట్లాడుతూ.. ప్రపంచ ఛాంపియన్ జట్టును తమ దేశంలో ఆహ్వానించడం గర్వంగా ఉందన్నారు. ఈ మ్యాచ్ ద్వారా ఈస్ట్ ఆసియా మార్కెట్‌లో క్రికెట్ క్రేజ్ పెంచడంతో పాటు, జపాన్‌లో క్రికెట్ మౌలిక వసతుల అభివృద్ధికి బిసిసిఐ సాంకేతిక సహకారాన్ని కూడా అందించనుంది.




# మహమ్మద్ షమీని ధీటుగా ఎదుర్కొంటాం!

**చెన్నై, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరు కోసం తాము అన్ని విధాలా సిద్ధమయ్యామని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ వెల్లడించాడు. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం చెన్నై వేదికగా ప్రారంభమయ్యే ఈ కీలక ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. శనివారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన తిలక్ వర్మ.. తమ జట్టు తరఫున కేఎల్ రాహుల్ ఆడటం లేదని స్పష్టం చేశాడు. అయితే దేవదత్ పడిక్కల్, మహమ్మద్ సిరాజ్‌లు బరిలోకి దిగుతున్నట్లు తెలిపాడు. "షమీ వేసే లైన్ అండ్ లెంగ్త్ బౌలింగ్‌ను తీవ్రంగా గమనించాం, దాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని మా సత్తా చాటుతాం" అని తిలక్ అన్నాడు. కాగా, ఏకంగా 54 సంవత్సరాల తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ ముఖాముఖి తలపడుతున్నాయి. చివరిసారిగా 1970-71 సీజన్‌లో బ్రాబోర్న్ స్టేడియంలో తలపడగా, ఆ మ్యాచ్‌లో సౌత్ జోన్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం మీద సౌత్ జోన్ ఫైనల్ చేరడం ఇది 24వ సారి కాగా, ఇప్పటివరకు 13 టైటిళ్లు గెలుచుకుంది. మరోవైపు 13 ఏళ్ల విరామం తర్వాత ఫైనల్ చేరిన ఈస్ట్ జోన్, ఇప్పటివరకు 8 సార్లు ఫైనల్స్ ఆడి 2 సార్లు మాత్రమే విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరుకానున్నారు. అతని పదవీకాలం అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రపంచకప్ వరకు పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియాతో సమావేశం జరగనుంది. అలాగే రాబోయే ఆసియా గేమ్స్ కోసం నెట్ బౌలర్లుగా మయాంక్ యాదవ్, కార్తీక్ త్యాగి, మొహ్సిన్ ఖాన్‌లకు అవకాశం లభించనుంది.



# పాకిస్థాన్ టీమ్‌లో 'ఆపరేషన్ క్లీన్-అప్'!

**లండన్, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఇంగ్లాండ్ దెబ్బకు పాకిస్థాన్ క్రికెట్‌లో భారీ భూకంపం సంభవించింది! లార్డ్స్ మైదానంలో జరిగిన రెండో టెస్టులో 194 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూడటంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆగ్రహంతో ఊగిపోతోంది. ఈ అవమానకర ఓటమితో సీరియస్ అయిన బోర్డు, సిరీస్ మధ్యలోనే ఏకంగా ఏడుగురు సీనియర్ ప్లేయర్లపై నిర్దాక్షిణ్యంగా వేటు వేసింది. జట్టు నుంచి తొలగించిన వారిలో మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్-ఉల్-హక్, సల్మాన్ అలీ ఆఘా, అలీ ఉస్మాన్, అమీర్ జమాల్, అవైస్ జాఫర్, ఖుర్రమ్ షెహజాద్ ఉన్నారు. ఫ్లాప్ ఫార్మ్‌లో ఉన్న సీనియర్లను పక్కనబెట్టి సైమ్ అయూబ్, అబ్దుల్లా షఫీక్‌లతో పాటు అర్సాత్ మిన్హాస్, మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బేగ్, మహమ్మద్ ఇమ్రాన్, రజావుల్లా వంటి ఐదుగురు యంగ్ ప్లేయర్లకు తొలిసారి అవకాశం ఇచ్చారు. ఆటగాళ్లతో పాటు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా పదవుల నుంచి ఊడబీకి సరికొత్త డ్రామాకు తెరతీశారు. మైక్ హెస్సన్, యాసిర్ అరఫాత్‌లకు ఈ పర్యటన ముగిసేవరకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే 0-2తో సిరీస్ కోల్పోయిన పాక్, సెప్టెంబర్ 9 నుంచి జరగబోయే మూడో టెస్టులోనైనా పరువు కాపాడుకుంటుందో లేదో చూడాలి.




# సీఎస్కే కెప్టెన్ మార్పు తప్పదా!

**చెన్నై, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత విజయవంతమైన ఫ్రాంచైజీలలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ రాబోయే సీజన్ కోసం సంచలనాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. గత కొన్ని సీజన్లుగా జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో, మేనేజ్‌మెంట్ జట్టు నాయకత్వంలో మార్పులు చేసేందుకు తీవ్రంగా యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా, ప్రస్తుత సారథి రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, ఆ స్థానాన్ని వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు అప్పగించాలని అనేకమంది క్రికెట్ విశ్లేషకులు మరియు మాజీ ఆటగాళ్లు సూచిస్తున్నారు. చెన్నై సూపర్ కింగ్స్ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా వరుసగా మూడేళ్లపాటు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. ఇది ఫ్రాంచైజీ యాజమాన్యంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది. గత 2026 ఐపీఎల్ సీజన్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ వ్యక్తిగత ప్రదర్శన కూడా జట్టుకు ఏమాత్రం కలసి రాలేదు. ఆయన కేవలం 28 సగటుతో 337 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా విఫలమయ్యారు. కెప్టెన్సీ ఒత్తిడి కారణంగానే ఆయన బ్యాటింగ్ తీవ్రంగా ప్రభావితమైందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో, మినీ వేలం లేదా ట్రేడింగ్ ద్వారా జట్టులోకి వచ్చిన సంజూ శాంసన్‌కు నాయకత్వ పగ్గాలు అప్పగిస్తే జట్టు పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజూ శాంసన్‌కు ఐపీఎల్‌లో సారథిగా మంచి అనుభవం ఉందనేది స్పష్టమవుతోంది. రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆయన ఏకంగా 66 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించారు. అందులో 50 శాతానికి పైగా గెలుపు శాతాన్ని నమోదు చేయడమే కాకుండా, తన సమర్థవంతమైన నాయకత్వంతో రాజస్థాన్ జట్టును ఫైనల్‌కు కూడా తీసుకెళ్లారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, యంగ్ ప్లేయర్లను సరిగ్గా ప్రోత్సహించడం సంజూ శాంసన్ ప్రత్యేకత. తమిళనాడుకు చెందిన మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ సైతం ఈ అంశంపై స్పందిస్తూ.. రుతురాజ్ గైక్వాడ్‌పై నుంచి కెప్టెన్సీ భారాన్ని తొలగిస్తే, ఆయన ఓపెనర్‌గా ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలరని వ్యాఖ్యానించారు. చెన్నై జట్టుకు రుతురాజ్ అత్యంత కీలకమైన బ్యాటర్ అని, కెప్టెన్సీ భారం వల్ల ఆయన నాణ్యమైన ఆటను కోల్పోకూడదని బద్రీనాథ్ పేర్కొన్నారు. ఇవే కాకుండా, సీఎస్కే తుది జట్టులో మరికొన్ని కీలక మార్పులు కూడా త్వరితగతిన చేపట్టాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. రాబోయే సీజన్ నాటికి జట్టులో మిడిల్ ఆర్డర్ బలాన్ని పెంచడంతో పాటు, డెత్ ఓవర్లలో నిలకడగా బౌలింగ్ చేసే పేసర్లను ఎంపిక చేసుకోవడంపై ఫ్రాంచైజీ దృష్టి సారించింది. సంజూ శాంసన్‌కు కెప్టెన్సీ ఇస్తే, అది సీఎస్కే భవిష్యత్తుకు సరికొత్త దిశను నిర్దేశిస్తుందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.



# యంగ్ పేసర్ ప్రిన్స్‌పై బిసిసిఐ ఫోకస్!

- జస్ప్రీత్ బుమ్రా కంబ్యాక్‌పై కొనసాగుతున్న సస్పెన్స్!
- బుమ్రా బ్యాకప్‌గా యంగ్ పేసర్ ప్రిన్స్!
- గాయాలతో సతమతమవుతున్న టీమిండియా కీలక ప్లేయర్లు!
- ఆటగాళ్లకు త్వరలో మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులు!
- ప్రపంచకప్ ముంగిట భయపెడుతున్న వరుస గాయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (సమయం న్యూస్):** భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా మైదానంలోకి తిరిగి రావడంపై నెలకొన్న ఉత్కంఠకు ఇంకా తెరపడలేదు. గత కొంతకాలంగా మోకాలినొప్పితో బాధపడుతున్న బుమ్రా, ప్రస్తుతం ఫిట్‌నెస్ సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే, బిసిసిఐ (దీజజ×) మెడికల్ టీమ్ నుంచి ఆయనకు ఇప్పటివరకు పూర్తిస్థాయి ఫిట్‌నెస్ క్లియరెన్స్ లభించలేదు. రాబోయే ఆఫ్ఘనిస్థాన్ టి20 సిరీస్ అలాగే 2026 ఆసియా క్రీడల భారత స్క్వాడ్‌లో బుమ్రా పేరును చేర్చినప్పటికీ, ఆయన తుది జట్టులో ఆడటం అనేది కేవలం ఆయన ఆరోగ్య పరిస్థితి మరియు ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుందని బోర్డు వర్గాలు స్పష్టం చేశాయి. జూలై 16న ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ తర్వాత బుమ్రా మళ్లీ పూర్తిస్థాయిలో బౌలింగ్ చేయలేదు. ఆయన కోలుకోవడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో, బిసిసిఐ సెలెక్టర్లు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే యంగ్




ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌ను బుమ్రాకు బ్యాకప్ పేసర్‌గా పరిశీలిస్తున్నారు. దేశవాళీ క్రికెట్‌లో వరుసగా రాణిస్తున్న ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇస్తే, అంతర్జాతీయ స్థాయిలో ఆయన సేవలు ఉపయోగపడతాయని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు, కేవలం బుమ్రా మాత్రమే కాకుండా భారత జట్టులోని మరికొందరు కీలక ఆటగాళు




కూడా గాయాల బారిన పడటం జట్టు యంత్రాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, మరియు సాయి సుదర్శన్ ప్రస్తుతం గాయాల నుంచి కోలుకుంటున్నారు. వీరి ఫిట్‌నెస్‌ను కచ్చితంగా అంచనా వేసేందుకు నేషనల్ క్రికెట్ అకాడమీ (చీజూ) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక మ్యాచ్ సిమ్యులేషన్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ కఠినమైన పరీక్షల్లో ఫిట్‌నెస్ నిరూపించుకున్న ఆటగాళ్లు మాత్రమే సెప్టెంబర్ 10న ఢిల్లీ చేరుకునే భారత జట్టుతో కలిసి ప్రయాణిస్తారు. ఈ పరిణామాలపై భారత మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బుమ్రా వంటి కీలక బౌలర్ తరచూ గాయాలపాలవడం జట్టు సమతుల్యతను దెబ్బతీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ ఉన్న నేపథ్యంలో, ప్రధాన బౌలర్లు నిలకడైన ఫిట్‌నెస్‌తో ఉండటం చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమైన టోర్నీలకు ముందు కీలక ఆటగాళ్లు దూరం కావడం అభిమానులతో పాటు జట్టు యాజమాన్యానికి పెద్ద సవాలుగా మారింది.




# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చోని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్

'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ -- ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.



# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహరాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది.ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.




# మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు

సాధారణ డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించి.. నిర్మాతగా మారి ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దిల్‌రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 60కి పైగా సినిమాలు చేయడంతో పాటు ఎందరో హీరోలను, హీరోయిన్లను, దర్శకులను, ఇతర టెక్నీషియన్లను వెండితెరకు పరిచయం చేశారు రాజుగారు. దిల్‌రాజు బ్యానర్ నుంచి సినిమా వస్తుందంటే ఖచ్చితంగా దానిలో విశేషం ఉంటుందని ప్రేక్షకులు నమ్ముతారంటే చిత్ర పరిశ్రమపై ఆయన ఎలాంటి ముద్రవేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు చిత్ర పరిశ్రమను శాసించే వ్యక్తుల్లో ఒకరిగా.. నైజాం కింగ్‌గా అభిమానులను దిల్‌రాజును పిలుచుకుంటారు. ఆయన మాటలు, చేతలు ఖచ్చితంగా ఇండస్ట్రీపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దిల్‌రాజు ఓ ప్రాజెక్ట్ డీల్ చేస్తున్నారంటే ఖచ్చితంగా ఎన్నో లెక్కలు వేసుకుంటారని, ఆయన జడ్జిమెంట్ తప్పదని ఇండస్ట్రీ జనాల నమ్మకం. ఒక సినిమా రష్ చూసి అది ఎన్ని రోజులు ఆడుతుంది? ఎంత వసూలు చేస్తుంది? అనేది లెక్కలతో సహా చెప్పగల మేధావి దిల్‌రాజు. గత కొన్నేళ్ల వరకు ఆయన పట్టిందల్లా బంగారం అన్నట్లుగా సాగింది. స్టార్స్‌తో సినిమాలు తీసినా.. కొత్త వారిని పరిచయం చేసినా భారీ వసూళ్లతో బ్రాండ్ సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. అయితే కొద్దికాలంగా రాజుగారి లెక్కలు తప్పుతున్నాయి. సినిమాల నిర్మాణంతో పాటు డిస్ట్రిబ్యూషన్ పరంగానూ భారీ నష్టాలు మూటకట్టుకుంటున్నారు. ఇటీవల టాక్సిక్ మూవీ ఆంధ్రా-నైజాం రైట్స్‌ని ఏకంగా 100 కోట్లకు పైగా వెచ్చించి సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. యశ్ నటించిన ఈ



సినిమా తొలిరోజు నుంచే డివైడ్ టాక్ తెచ్చుకుంది. సినిమాలు, డిస్ట్రిబ్యూషన్ మాత్రమే కాదు.. తన సామ్రాజ్యంగా చెప్పుకునే నైజాంలోకి బడా నిర్మాతలు అడుగుపెట్టడంతో ఆయన కోట బీటలు వారుతోంది. ఎంతమంది వచ్చినా తన మార్క్ చూపిస్తూ, ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడుతున్నారు దిల్‌రాజు. ఈ జనరేషన్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా ఘనత సాధించిన ఆయన.. గత కొంతకాలంగా ఇండస్ట్రీలో తీరుతెన్నులు... పెరిగిన ప్రొడక్షన్ ఖర్చులు తదితర అంశాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ సినిమా ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దిల్‌రాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. కోర్ట్ మూవీతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కొత్త కుర్రాడు హర్ష్ రోషన్ నటించిన లేటెస్ట్ మూవీ తెల్ల కాగితం. నక్షత్ర హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీపక్, అజయ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తుండగా.. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మాలపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నందు సవరిగాన కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. విజయ్ బుల్గాని సంగీత దర్శకత్వం వహించగా.. కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలోనే తెల్ల కాగితం మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను సెప్టెంబర్ 5వ తేదీన హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దిల్‌రాజ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీ జీవితం తెల్లకాగితం అయితే అందులో ఎర్ర మచ్చ ఏంటీ అని యాంకర్ స్రవంతి అడగ్గా.. దానికి దిల్‌రాజు స్పందించారు. ఎవరి జీవితంలోనూ తెల్ల కాగితం ఉండదు, జీవితంలో తెలిసి తెలియక అందరూ తప్పులు చేస్తుంటారు. తెల్ల కాగితం మీద ఎర్ర మచ్చ పడితే ఎలా ఉంటుందనేది ఈ సినిమా కథ. ఇప్పుడున్న సొసైటీలో మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు.. కాబట్టి వాళ్ల కోసమైనా మనం చెడుగా ఉండాల్సిందే. తెల్ల కాగితం టైటిల్‌కు ఇన్నోసెంట్ లవ్ అనే క్యాప్షన్ పెట్టమని చెప్పాను. ఈ స్టోరీ విన్నప్పుడు కొత్త బంగారం లోకం అనే సినిమాను 18 ఏళ్ల క్రితం తీసినప్పుడు ఎలా ఫీలయ్యానో అలాగే అనిపించింది. 2000వ సంవత్సరంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ తెల్ల కాగితం సినిమాను తీశారు. ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఆకాంక్షిస్తున్నా. ఈ సినిమాను చూజి ఈ తరం తమ జీవితంలో ఎర్ర మచ్చ పడకుండా జాగ్రత్త పడాలనేది ఈ కథ. మా కృష్ణతో నాది 20 ఏళ్ల జర్నీ.. ఎప్పుడూ ఏమీ అడగడు, అడిగినప్పుడు అండగా నిలబడాలి కదా? అని దిల్‌రాజు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దిల్‌రాజు వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**